



Truth of News

PRGI Reg No: APTEL/26/A4782

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



అన్నమయ్య జిల్లా | సంపుటి: 01 | సంచిక : 353 | సోమవారం 13 జూలై 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi




## కన్నీటి వీడ్కోలు

- మైసూరులో అధికారిక లాంఛనాలతో జానకమ్మ అంత్యక్రియలు పూర్తి
- అంతిమయాత్రలో భారీగా పాల్గొన్న అభిమానులు

మైసూరు - సూర్య వాస్తవం

గానకోకిల ఎస్. జానకి అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. కర్నా టక ప్రభుత్వం జానకమ్మ అంత్య క్రియలను మైసూరులో అధికారిక లాంఛనాలతో జరిపించింది. ఆమె అంతి మయాత్రలో పెద్ద సంఖ్యలో ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు. జానకమ్మ కోరిక మేరకు కణియన హుండి ఫామ్ హౌస్‌లో

- మిగతా 2లో..

# పశ్చిమాసియాలో రణరంగం...

- హర్మూజ్ జలసంధి బంద్!
- అమెరికా స్థావరాలే టార్గెట్‌గా ఇరాన్ క్షిపణుల వర్షం
- ఖతార్, ఒమన్‌లపై బాలిస్టిక్ మిస్సైళ్లతో దాడులు
- గాల్లోనే కూల్చివేసిన ఖతార్ డిఫెన్స్ సిస్టమ్స్.. ముగ్గురు పౌరులకు గాయాలు
- ఇరాన్ స్థావరాలపై అమెరికా సేనల భీకర ప్రతిదాడులు.. 140 లక్ష్యాలు ధ్వంసం
- సముద్ర కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేసిన ఖతార్ ప్రభుత్వం



దోహా/మస్కట్ - సూర్య వాస్తవం

పశ్చిమాసియాలో దాడులు, ప్రతిదాడులతో యుద్ధ వాతావరణం నెలకొంది. అంతర్జాతీయంగా అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని (హ్రెత్థుఖ్ శీట ఎశీతీఎబఓ) తాము మరోసారి మూసివేస్తున్నట్లు ఇరాన్ సంచలన ప్రకటన చేసింది. వాణిజ్య నౌకలపై దాడులు జరుగుతుండటంతో గల్ఫ్ ప్రాంతంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది. అయితే, జలసంధిలో నౌకాయానం యథావిధిగా కొనసాగుతోందని, అంతర్జాతీయ నౌకల రక్షణకు తమ దళాలు సిద్ధంగా ఉన్నాయని అమెరికా సెంట్రల్ కమాండ్ (జజుచీజూవీ) స్పష్టం చేసింది.

**లిఖతార్ సంచలన నిర్ణయం..**
**దోహాపై క్షిపణుల కలకలం!**

ప్రస్తుత విపత్కర పరిస్థితుల నేపథ్యంలో గల్ఫ్ దేశం ఖతార్ కీలక నిర్ణయం

- మిగతా 2లో..




## తొలగింపు కాదు.. సస్పెన్షనే!

- 'అరెస్టయిన ప్రధాని, సీఎంలపై వేటు' బిల్లులో జేపీసీ కీలక మార్పులు
- శాశ్వత ఉద్వాసన ఉండదు..
- 30 రోజుల్లో నిర్దోషులుగా విడుదలైతే ఆటోమేటిగ్గా తిరిగి పదవుల్లోకి
- పార్లమెంటరీ కమిటీ సిఫారసులు
- 20 నుంచి పార్లమెంటు సమావేశాలు

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

అవినీతికి వ్యతిరేకంగా మోదీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఓ కీలక బిల్లుపై ప్రతిపక్షాల నిరసనల నేపథ్యంలో పార్ల మెంటరీ సంయుక్త సంఘం(జేపీసీ) ఐదు ప్రధాన మార్పులు సూచించింది. తీవ్ర నేరాల ఆరోపణలతో ప్రధానమంత్రి, సీఎంలు, మంత్రులు 30 రోజులకుపైగా నిర్బంధంలో ఉంటే.. వారు

- మిగతా 2లో..

# ఇక ప్రయివేటు క్షిపణులు

- కేంద్రంలోని మోడీ సర్కారు పన్నాగాలు
- తొలి దశలో అస్త్ర మార్క్-2 క్షిపణులు!
- ఉత్పత్తి లక్ష్యాల భారం పేరిట బీడీఎల్ నిర్వీర్యం
- రక్షణ ఉత్పత్తుల డిమాండ్ పెరగడంతో కొత్త వ్యూహమంటూ అడ్డదారి
- బరిలో ఐకామ్, అదానీ, ఫోర్జ్, టాటా, మహీంద్రా
- ముమ్మాటికీ దేశభద్రతకు ముప్పే : రక్షణశాఖ మాజీ సైన్యాధిపతులు



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

కేంద్రంలోని మోడీ సర్కారు దేశంలోని ప్రభుత్వరంగ సంస్థల్ని విక్రయిస్తుంటే..ఇపుడు కీలకమైన రక్షణ శాఖను కూడా హోల్ సేల్ గా ప్రయివేట్ సంస్థలకు కట్టబెట్టే దిశగా పావులు కదుపుతోంది. దేశ భద్రతలో కీలకమైన క్షిపణుల తయారీని కూడా కార్పొరేట్ల గుప్పెట్లోకి తీసుకెళ్లేలా కేంద్రంలోని మోడీ సర్కారు యోచిస్తోంది. ఇందులో భాగంగా దేశ రక్షణ రంగంలో మరో కీలక సంస్కరణకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్టు సమాచారం. ఇప్పటివరకు ప్రభుత్వ రంగ సంస్థలకే పరిమితమైన క్షిపణుల తయారీలో ఇకపై ప్రయివేటు సంస్థలకు కూడా అవకాశం కల్పించేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా భారత రక్షణ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్, దేశ సాయుధ బలగాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ చర్యతో స్వదేశీ రక్షణ తయారీ సామర్థ్యం పెరగడంతో పాటు రక్షణ ఎగుమతులు కూడా మరింత వేగం పుంజుకునే అవకాశం ఉందని అధికారుల వాదన. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం.. రక్షణ రంగంలో ప్రయివేటు భాగస్వామ్యాన్ని క్రమంగా పెంచుతూవస్తోంది. యుద్ధ విమానాలు, డ్రోన్లు, నౌకాదళా నికి అవసరమైన పరికరాల తయారీలో

- మిగతా 2లో..



## విద్యార్థులకు సీఎం విజయ్ సత్కారం..

- టీవీకే పార్టీ ఆధ్వర్యంలో విద్యా పురస్కారాల ప్రదానం
- 10, 12వ తరగతి టాపర్లను సత్కరించనున్న సీఎం విజయ్
- ప్రతి నియోజకవర్గంలోని ముగ్గురు టాపర్లకు బంగారు పతకాలు
- ముఖ్యమంత్రి అయ్యాక తొలిసారిగా కార్యక్రమం నిర్వహణ
- ఇది ప్రభుత్వ కార్యక్రమం కాదని, పార్టీదేనని స్పష్టత



## జానకి మరణం దేశ సంగీత రంగానికి తీరని నష్టం: మోదీ

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ప్రముఖ నేపథ్య గాయని ఎస్.జానకి మరణం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం సంతాపం వ్యక్తం చేశారు. వివిధ భారతీయ భాషల్లో జానకి ఆలపించిన పాటలు తరతరాలుగా సంగీతాభిమానులను అలరించాయని, ఆమె గాత్రం ప్రతి భావోద్వేగాన్ని అపూర్వమైన హుందాతనం, వైవిధ్యంతో ఆవిష్కరించిందని కొనియాడారు. వృద్ధాప్య సంబంధిత ఆరోగ్య సమస్యల కారణంగా శనివారం మైసూర్‌లోని ఓ ప్రైవేట్

- మిగతా 2లో..



## విశాఖకు జగన్..

- గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను పరామర్శించనున్న వైసీపీ అధినేత
- ఈ నెల 14న విశాఖకు వెళ్లనున్న జగన్
- బోటు ప్రమాదంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు పరామర్శ
- ప్రభుత్వ వైఫల్యంపై తీవ్రస్థాయిలో మండిపడ్డ వైసీపీ నేతలు
- సీఎం, డిప్యూటీ సీఎం మౌనంపై వైసీపీ విమర్శలు
- ప్రమాదం నుంచి బయటపడిన మత్స్యకారుడితోనూ జగన్ భేటీ

2లో

# వెంటనే విధుల్లోకి వచ్చేస్తానంటున్నారు

- ప్రజాసేవలో పడి భుజాల గాయాలను నిర్లక్ష్యం చేశారు
- ప్రస్తుతం నిలకడగా జనసేనాని ఆరోగ్యం
- మూడు వారాలు ఫిజియోథెరపీ ఉంటుంది
- నూతనోత్సాహంతో తిరిగొస్తారు: సీఎం చంద్రబాబు
- ముంబై ఆస్పత్రిలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి పరామర్శ



అమరావతి - సూర్య వాస్తవం

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ముంబైలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో భుజానికి విజయవంతంగా శస్త్రచికిత్స జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఆదివారం ఆయన ముంబై వెళ్లి ఆసుపత్రిలో పవన్ కల్యాణ్‌ను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పవన్ ఆరోగ్య పరిస్థితిని, వైద్యుల సూచనలను వివరించారు.

**అభిమానుల తాకిడి వల్లే సమస్య**

పవన్ కల్యాణ్ ఎప్పుడూ ప్రజల సేవలోనే ఉంటారని, వారి మధ్యకు వెళ్లినప్పుడు తనను తాను మరిచిపోతారని చంద్రబాబు అన్నారు. "పవన్ ఎక్కడికి వెళ్లినా పెద్ద సంఖ్యలో జనం వస్తారు. ఆ సమయంలో తోపులాట, ఒత్తిడి సర్వసాధారణం. ఈ ఒత్తిడి కారణంగానే ఆయన భుజానికి సమస్య వచ్చింది. ఇది ఈరోజు వచ్చింది కాదు, చాలా కాలంగా ఈ నొప్పితో బాధపడుతున్నారు. చివరకు ఇక్కడికి వచ్చి అత్యుత్తమ వైద్యుల చేత ఆపరేషన్ చేయించుకున్నారు. దాదాపు మూడున్నర గంటల పాటు ఈ ఆపరేషన్ జరిగింది" అని చంద్రబాబు

- మిగతా 2లో..



2లో

## నేడు దేవాదులకు సీఎం రేవంత్ రెడ్డి

- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులతో కలిసి పరిశీలన
- భూసేకరణ, ఇతర అంశాలపై అక్కడే సమీక్ష
- తర్వాత హైదరాబాద్‌లో రాష్ట్ర ఎంపీలతో భేటీ
- అన్ని పార్టీల పార్లమెంటు సభ్యులకు ఆహ్వానం
- రాష్ట్రానికి అందాల్సిన నిధులు, ప్రాజెక్టుల
- అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తే అంశంపై చర్చ
- కాంగ్రెస్ ఎంపీలతో రేవంత్‌రెడ్డి ప్రత్యేక భేటీ!

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# వెంటనే విధుల్లోకి వచ్చేస్తానంటున్నారు

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ప్రస్తుతం పవన్ వేగంగా కోలుకుంటున్నారని, త్వరలోనే పూర్తి ఆరోగ్యవంతులవుతారనే విశ్వాసం ఉందని చెప్పారు. వైద్యుల సూచన మేరకు పవన్ కల్యాణ్‌కు మూడు వారాల పాటు పూర్తి విశ్రాంతి అవసరమని చంద్రబాబు పేర్కొన్నారు. ఆ తర్వాత ఫిజియోథెరపీ చేయించుకోవాల్సి ఉంటుందని వివరించారు. "పవన్ రెండో భుజానికి కూడా కొంచెం సమస్య ఉంది. దానికి ప్రస్తుతానికి ఫిజియోథెరపీ, వ్యాయామాలు చేయాలని వైద్యులు సూచించారు. ఆరు నెలల తర్వాత పరిస్థితిని సమీక్షించి, అవసరమైతే తదుపరి చర్యలు తీసుకుంటారు" అని చంద్రబాబు వెల్లడించారు.

**జాతీయ అంశాలపై స్పందన**

ఈ సందర్భంగా చంద్రబాబు పలు జాతీయ అంశాలపై కూడా మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రశంసల వర్షం కురిపించారు. "ప్రధాని మోదీ వల్ల ప్రపంచవ్యాప్తంగా భారతదేశ గౌరవం పెరిగింది. ఆయన కేవలం భారతదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా గౌరవించబడే శక్తివంతమైన నాయకుడు. నేడు ప్రపంచ దేశాలన్నీ ఆర్థిక సమస్యలతో సతమతమవుతుంటే, భారతదేశం మాత్రం స్థిరంగా అధిక వృద్ధి రేటును సాధిస్తోంది. దీనికి కారణం మోదీ నాయకత్వమే. సరైన సమయంలో, సరైన ప్రదేశంలో, సరైన నాయకుడు ఉండటం వల్లే ఇది సాధ్యమవుతోంది. ఆయన నాయకత్వంలో 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందనే పూర్తి విశ్వాసం నాకుంది" అని చంద్రబాబు అన్నారు. వియత్నాం పడవ ప్రమాదంపై మాట్లాడుతూ.. అది చాలా దురదృష్టకరమైన సంఘటన అని, పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని తెలిపారు. మృతదేహాలను వెనక్కి తీసుకువస్తున్నామని, అక్కడున్న వారిని సురక్షితంగా వెనక్కి పంపే ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఇక ఉత్తరప్రదేశ్ లో అయోధ్య ఘటనపై మాట్లాడుతూ.. ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, విచారణ జరుగుతున్నందున కొంత సమయం వేచి చూడాలన్నారు. పశ్చిమ బెంగాల్‌లో యూసీసీ కమిటీ ఏర్పాటును స్వాగతిస్తూ.. ఒకప్పుడు 'బెంగాల్ ఈరోజు ఆలోచించింది, దేశం రేపు ఆలోచిస్తుంది' అనే వారని, మధ్యలో ఆగిపోయిన ఆలోచన ఇప్పుడు మళ్లీ మొదలైందని, బెంగాల్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ గురించి అడిగిన ప్రశ్నకు, నాయకుల పనితీరును బట్టే ప్రజలు అంచనా వేస్తారని, సమస్యల్లో ఉన్న ప్రజలకు అండగా ఉన్నప్పుడే నాయకులకు విశ్వసనీయత లభిస్తుందని చంద్రబాబు పరోక్షంగా చురకలు అంటించారు. అనంతరం, పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన వైద్యుల నివేదికను చంద్రబాబు మీడియాకు అందించారు.

### జానకి మరణం దేశ సంగీత రంగానికి
# తీరని నష్టం: మోదీ

(మొదటిపేజీ తరువాయి)

ఆసుపత్రిలో ఎస్. జానకి కన్నుమూశారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా స్పందించిన ప్రధాని మోదీ, జానకి మరణం భారత సంగీత, సాంస్కృతిక రంగాలకు తీరని లోటని పేర్కొన్నారు. ఆమె గాత్ర మాధుర్యం రాబోయే తరాలనూ అలరిస్తూనే ఉంటుందని అన్నారు. ఈ క్లిష్ట సమయంలో ఆమె కుటుంబ సభ్యులకు, అభిమానులకు, సంగీత ప్రపంచానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ "ఓం శాంతి" అని నివాళులర్పించారు. ఆరు దశాబ్దాలకు పైగా సాగిన తన సంగీత ప్రస్థానంలో ఎస్. జానకి సుమారు 48 వేలకుపైగా పాటలను ఆలపించారు. ప్రధానంగా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషలతో పాటు హిందీ, ఒడియా, ఉర్దూ, పంజాబీ, బెంగాలీ తదితర సుమారు 20 భారతీయ భాషల్లో సినిమాలు, ఆల్బమ్‌లు, టెలివిజన్, రేడియో కార్యక్రమాలకు తన గాత్రాన్ని అందించి భారతీయ సంగీత చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు.

# తొలగింపు కాదు.. సస్పెన్షనే!

(మొదటిపేజీ తరువాయి)

స్వచ్ఛందంగా రాజీనామా చేయకుంటే 31వ రోజు ఆటోమేటిగ్గా వారిపై తొలగింపు వేటు పడుతుందని కేంద్రం తీసుకొచ్చిన బిల్లును గత ఏడాది పార్లమెంటు సమావేశాల్లో విపక్ష ఇండీ కూటమి తీవ్రంగా వ్యతిరేకించిన సంగతి తెలిసిందే. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకే ఈ క్రూర బిల్లును తీసుకొచ్చారని ఆరోపించాయి. ప్రభుత్వ అధీనంలోని దర్యాప్తు సంస్థలు ఆయా నిబంధనలను దుర్వినియోగం చేసే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేశాయి. బిల్లుపై అధ్యయనానికి ఏర్పాటుచేసిన జేపీసీలో భాగమయ్యేందుకు చాలా పార్టీలు నిరాకరించాయి కూడా. ఈ నేపథ్యంలో ప్రధాని, సీఎంలు, కేంద్ర మంత్రులను శాశ్వతంగా తొలగించడం అనే పదం స్థానంలో.. వారు 'సస్పెన్షన్'లో ఉంటారన్న పదం చేర్చాలని పార్లమెంటరీ కమిటీ తాజాగా సిఫారసు చేసింది. అంతేగాక.. నిర్దిష్ట 30 రోజుల్లో వారు నిర్దోషులుగా విడుదలైతే.. ప్రాసిక్యూషన్ నిర్దిష్ట గడువులోగా ముందుకెళ్లకుంటే.. వారు ఆటోమేటిగ్గా తిరిగి పదవుల్లోకి వస్తారంటూ మార్చాలని సూచించింది. అలాగే వారిపై వచ్చిన 'తీవ్ర నేరాభియోగాల'ను నిర్వచించింది. ఐదేళ్లు.. అంతకుపైబడి శిక్షపడే నేరాలుగా పరిగణించాలని పేర్కొంది. అలాగే సస్పెన్షన్‌కు గురయ్యే నేరాలేమిటో నిర్దిష్టంగా పేర్కొనాలని ప్రతిపాదించింది. అత్యున్నత స్థాయి రాజ్యాంగ పదవుల్లో ఉన్న నేతలు ఎదుర్కొనే కేసుల విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు లేదా ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని.. సంబంధిత నిందితులు దోషులు కాదని కోర్టులు తేలిస్తే.. పునర్నియమితులవుతారని.. సస్పెన్షన్ శాశ్వతంగా ఉండదన్న సురక్షిత చర్యలు బిల్లులో ఉండాలని సిఫారసు చేసింది. అలాగే ఆయా వ్యక్తులపై వేటు వేయడానికి.. 30 రోజుల కస్టడీకి ప్రత్యామ్నాయంగా 'అభియోగాల నమోదు దశ'ను కొలమానంగా తీసుకోవాలని ముసాయిదాలో జేపీసీ సూచించింది. ప్రతిపాదిత సవరణలను కేంద్ర హోం శాఖ కేంద్ర మంత్రివర్గం దృష్టికి తీసుకెళ్తుంది. క్యాబినెట్ ఆమోదిస్తే లోక్‌సభలో అధికారిక సవరణలను ప్రవేశపెడుతుంది. ఈ నెల 20 నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాలు మొదలవుతున్నాయి. ఆగస్టు 13 వరకు ఇవి జరుగుతాయి. తాజా సవరణలను ప్రతిపక్షాలు ఆమోదిస్తాయని ప్రభుత్వం ఆశాభావంతో ఉంది.

**ఆ నిబంధన రాజ్యాంగ విరుద్ధం!**

నిరవధికంగా నెల రోజులపాటు కస్టడీలో ఉంటే ప్రధానమంత్రి, సీఎంలు, మంత్రులను శాశ్వతంగా తొలగించవచ్చన్న నిబంధన రాజ్యాంగ విరుద్ధమని అత్యధికులు అభిప్రాయపడ్డారు. రాజ్యాంగ నిపుణులు, పాలనావేత్తలతో జేపీసీ జరిపిన సంప్రదింపుల్లో.. ఈ నిబంధనను తొలగించాలని సూచించారని జేపీసీ తన ముసాయిదా నివేదికలో వెల్లడించింది. జేపీసీలోని మెజారిటీ సభ్యులు కూడా తాజా మార్పులకు మద్దతిచ్చారు. అయితే కేంద్ర హోం శాఖ సస్పెన్షన్ అనే పదంపై అభ్యంతరం చెప్పినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. మరోవైపు.. బిల్లు ఆమోదం పొందాలంటే మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. దీంతో సంఖ్యాబలం సాధన దిశగా మోదీ ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. గత సమావేశాల్లో మహిళా రిజర్వేషన్‌తో నియోజకవర్గాల పునర్విభజనకు ముడిపెడుతూ హడావుడిగా తీసుకొచ్చిన బిల్లు వీగిపోయిన నేపథ్యంలో ఈసారి వ్యూహాత్మకంగా అడుగులు వేయాలని భావిస్తోంది.

# ఇక ప్రయివేటు క్షిపణులు

(మొదటిపేజీ తరువాయి)

ప్రయివేటు సంస్థలకు తలుపులు తెరిచింది. ఇప్పుడు అత్యంత వ్యూహాత్మకంగా భావించే క్షిపణుల తయారీలోనూ ప్రయివేటు రంగాన్ని భాగస్వామ్యం చేయాలని కేంద్రం ప్రయత్నించడం దేశ భద్రతకు అంత ఆరోగ్యకరం కాదని రక్షణ రంగ నిపుణులు వాపోతున్నారు. ప్రభుత్వ రంగ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్)ను నిర్వర్యం చేసే ఇలాంటి ప్రయత్నాలను కేంద్రం విరమించుకోవాలని సూచిస్తున్నారు.

**డిమాండ్ పేరుతో బుకాయింపు**

ప్రస్తుతం భారత సాయుధ బలగాలతో పాటు మిత్రదేశాల నుంచి కూడా స్వదేశీ రక్షణ ఉత్పత్తులకు భారీ స్థాయిలో డిమాండ్ పెరుగుతోంది. అయితే ఆ అవసరాలన్నింటినీ ఒక్క బీడీఎల్ మాత్రమే తీర్చడం కష్టంగా మారుతోందని కేంద్రం సాకులు చెబుతోంది. బీడీఎల్‌కు తగిన బడ్జెట్ కేటాయింపులు, నియామకాలు చేస్తే ఉత్పత్తి లక్ష్యాలు అందుకోవడం పెద్ద కష్టమేమీ కాబోదని రక్షణ రంగ నిపుణులు అంటున్నారు. అంతేకాని దీనిని సాకుగా చూపి క్షిపణి తయారీ వంటి కీలక విభాగాలను ప్రయివేటు రంగ సంస్థలకు కట్టబెట్టేస్తే అవి లాభాల వేటలో దేశ భద్రతను సైతం పణంగా పెట్టే దుస్థితి వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ ప్రణాళికలో భాగంగా మొదటి దశలో గగనతలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించే అస్త్ర మార్క్-2 క్షిపణుల తయారీకి ప్రయివేటు సంస్థలను ఆహ్వానించనున్నట్టు తెలుస్తోంది. ఈ ప్రక్రియలో ఐకామ్, అదానీ గ్రూప్, భారత్ ఫోర్జ్, టాటా గ్రూప్, మహీంద్రా గ్రూప్ వంటి ప్రముఖ సంస్థలు పాల్గొనే అవకాశం ఉందని సమాచారం.

**రెండో దశలో 'ప్రళయ్'**

అస్త్ర మార్క్-2 క్షిపణిని డీఆర్‌డీఓ అభివృద్ధి చేసింది. ఇది దృశ్య పరిధికి అవతల ఉన్న లక్ష్యాలను కూడా సమర్థంగా ఛేదించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. చైనా అభివృద్ధి చేసి పాకిస్తాన్‌కు అందించిన పీఎల్-15ఈ దీర్ఘశ్రేణి క్షిపణికి దీటుగా ఈ క్షిపణిని రూపొందించారు. భారత వైమానిక దళంలోని తేజస్ మార్క్-1ఏ, మిగ్-29, సుఖోయ్-30 ఎంకెఐ, రఫేల్ యుద్ధ విమానాలకు ఈ క్షిపణిని అనుసంధానించనున్నారు. అస్త్ర మార్క్-2తో ప్రారంభమ య్యే ఈ ప్రయివేటు భాగస్వామ్యాన్ని తర్వాత మరింత విస్తరించాలని కేంద్రం యోచిస్తోంది. రెండో దశలో ప్రళయ్ వంటి శక్తిమంతమైన బాలిస్టిక్ క్షిపణుల తయారీలో కూడా ప్రయివేటు రంగానికి అవకాశం కల్పించే దిశగా ఆలోచనలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన ప్రళయ్ క్షిపణి అత్యాధునిక సాంకేతికతతో రూపొందింది. డబుల్ ఇంజిన్ వ్యవస్థతో పనిచేసే ఈ క్షిపణి ధ్వని వేగానికి ఆరు రెట్లు అధిక వేగంతో ప్రయాణించి సుమారు 500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను కచ్చితత్వంతో ధ్వంసం చేయగలదు.

**పెరిగిన క్షిపణుల ప్రాధాన్యత**

ప్రస్తుతం దేశ రక్షణ వ్యవస్థలో దీర్ఘశ్రేణి భూతల లక్ష్యాలను ఛేదించే క్రూయిజ్ క్షిపణులు, నెక్స్ట్ జనరేషన్ బ్రహ్మోస్, 300 కిలోమీటర్ల పరిధి కలిగిన దీర్ఘశ్రేణి గైడెడ్ రాకెట్ పినాక వంటి అత్యాధునిక ఆయుధ వ్యవస్థలను కూడా భారత్ అభివృద్ధి చేస్తోంది. వీటితో పాటు ప్రళయ్ క్షిపణి కూడా భారత రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయనుంది. ఇటీవలి కాలంలో జరిగిన సైనిక పరిణామాలు కూడా క్షిపణుల ప్రాధాన్యతను మరింత స్పష్టంగా చూపించాయి. ఆపరేషన్ సిందూర్‌తో పాటు ఇరాన్-అమెరికా మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల్లో క్షిపణులు, డ్రోన్లు మౌలిక సదుపాయాలపై ఎంతటి ప్రభావం చూపగలవో ప్రపంచం గమనించింది. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని భారత ప్రభుత్వం రక్షణతో పాటు దాడి చేసే సామర్థ్యాన్ని కూడా వేగంగా పెంచే చర్యలు చేపడుతోంది.

**రష్యా నుంచి ఐదు ఎస్-400 వ్యవస్థల కోనుగోలు**

ఈ క్రమంలో రష్యా నుంచి భారత్ కొనుగోలు చేసిన ఐదు ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థల్లో ఐదో వ్యవస్థ ఈ ఏడాది నవంబర్‌లో భారత్‌కు చేరుకోనున్నట్టు తెలుస్తోంది. అలాగే దేశ భద్రతను మరింత పటిష్టం చేసేందుకు మరో ఐదు ఎస్-400 వ్యవస్థల కొనుగోలుకు కూడా కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థలను ఆత్మాహుతి డ్రోన్లు, క్రూయిజ్ క్షిపణుల దాడుల నుంచి రక్షించేందుకు రష్యాకు చెందిన పాంట్‌సిర్ గగనతల రక్షణ వ్యవస్థను కూడా వినియోగించాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది.

# పశ్చిమాసియాలో రణరంగం...

(మొదటిపేజీ తరువాయి)

తీసుకుంది. ప్రజా భద్రత దృష్ట్యా తమ దేశ సముద్ర కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేయాలని వాణిజ్య నౌకల యాజమాన్యాలను ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు వాణిజ్య, విహార నౌకలతో పాటు చేపల బోట్లను కూడా సముద్రంలోకి వెళ్లకుండా నిలిపివేయాలని స్పష్టం చేసింది. ఇదిలా వుండగా, ఖతార్ రాజధాని దోహా లక్ష్యంగా ఇరాన్ ఇవాళ ఉదయం బాలిస్టిక్ క్షిపణులను ప్రయో గించింది. అయితే ఖతార్ వైమానిక రక్షణ వ్యవస్థ అప్రమత్తమై వాటిని గాల్లోనే విజయవంతంగా కూల్చివేసింది. ఈ క్రమంలో శిథిలాలు పడటంతో ఒక చిన్నారితో సహా ముగ్గురు పౌరులు తీవ్రంగా గాయపడ్డారు.

**అమెరికా భీకర ప్రతిదాడులు.. 140 లక్ష్యాలు ధ్వంసం!**

ఇరు దేశాల మధ్య కుదిరిన జూన్ ఒప్పందం (వీశీఖ) విఫలం కావడంతో ఘర్షణలు మళ్లీ తీవ్రమయ్యాయి. జలసంధిలో సైప్రియట్ పతాకంతో ప్రయాణిస్తున్న ఒక వాణిజ్య నౌకపై ఇరాన్ దాడి చేయడంతో అమెరికా భీకరంగా స్పందించింది. ఇరాన్‌కు చెందిన క్షిపణి, డ్రోన్ ప్రయోగ స్థావరాలు, నౌకాదళ కేంద్రాలు సహా దాదాపు 140 సైనిక లక్ష్యాలపై అమెరికా బలగాలు భారీ వైమానిక దాడులు జరిపినట్లు సమాచారం.

**ఒమన్ తీవ్ర నిరసన.. రాయబారికి సమన్లు!**

అమెరికా సైనిక స్థావరాలకు ఆశ్రయం ఇస్తున్న బహ్రెయిన్, కువైట్, ఖతార్, ఒమన్ వంటి పొరుగు దేశాలపై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడటాన్ని ఒమన్ తీవ్రంగా ఖండించింది. అమెరికా స్థావరాల నెపంతో తమ భూభాగంపై బాంబులు ప్రయోగించడాన్ని తప్పుబడుతూ ఇరాన్ రాయబారిని పిలిపించి అధికారికంగా నిరసన వ్యక్తం చేసింది. హర్మూజ్ జలసంధి సంక్షోభంపై చర్చల నిమిత్తం ఇరాన్ విదేశాంగ మంత్రికి ఒమన్ ఆతిథ్యం ఇచ్చిన మరుసటి రోజే ఇరాన్ ఈ రకమైన దాడులకు తెగబడటం గమనార్హం. మరోవైపు ముసందమ్ తీరంలో ఇరాన్ దాడికి గురైన 'జీఎఫ్ఎస్ గెలాక్సీ' నౌక నుండి 23 మంది సిబ్బందిని ఒమన్ భద్రతా దళాలు సురక్షితంగా రక్షించాయి. వీరిలో 11 మంది భారతీయ పౌరులు ఉన్నట్లు సమాచారం అందుతోంది.

# కన్నీటి వీడ్కోలు

(మొదటిపేజీ తరువాయి)

కుటుంబ సభ్యులు దహన సంస్కారాలు జరిపించారు. అభిమాని ఫామ్ హౌస్‌లో అంత్యక్రియలు హెచ్.డి. కోటే తాలూకా లోని కనియనహుండి గ్రామంలో ఉన్న ఒక వ్యవసాయ క్షేత్రంలో సాయంత్రం జానకి అంత్యక్రియలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పూర్తి అధికారిక లాంఛనాలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. జానకి కుమారుడు మురళీకృష్ణ ఈ ఏడాది జనవరిలోనే మరణించడంతో ఆమె మనవరాలు అప్సర దహన సంస్కార కార్యక్రమాలు నిర్వహించారు. కనియనహుండి గ్రామంలోని జానకి అభిమాని నవీన్‌కు చెందిన వ్యవసాయ క్షేత్రంలో ఈ అంత్యక్రియలు జరిగాయి.

**భావోద్వేగానికి గురైన అభిమానులు**

ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మహారాజా కాలేజ్ మైదానంలో సినీ ప్రముఖులు, సంగీత దర్శకులు, కళాకారులు, వేలాది మంది అభిమానులు ఆమెకు కన్నీటి వీడ్కోలు పలుకుతూ నివాళులర్పించారు. అనంతరం అంతిమ సంస్కారాల కోసం ఆమె భౌతికకాయాన్ని హెచ్.డి. కోటె తాలూకాలోని కనియనహుండి తోటలోకి తరలించారు. అక్కడ కాసేపు అభిమానుల సందర్శనార్థం భౌతికకాయాన్ని ఉంచారు. మధ్యాహ్నం 3:05 గంటలకు అంతిమ యాత్ర ప్రారంభమైంది. ?ఆమె కుటుంబ సభ్యులు, పోలీసులు, అధికారులు వాహనాల్లో వెంట వెళ్లారు. తమ అభిమాన గాయనికి చివరిసారిగా అభిమానులు దారి పొడవునా నీరాజనం పట్టారు. పోలీసులు భారీగా భద్రతా ఏర్పాట్లు చేశారు.

### నేడు దేవాదులకు
# సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ - సూర్య వాస్తవం**

దేవాదుల ప్రాజెక్టు పురోగతి, నీటి విడుదల, ఇంకా చేపట్టాల్సిన పనులను పరిశీలించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ప్రాజెక్టు పర్యటనకు వెళుతున్నారు. ఆయనతో పాటుగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇతర శాఖల మంత్రులు పొంగులేటి శ్రీనివ్ష?సరెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, సీతక్క కూడా వెళ్లనున్నారు. ఆదివారం సీఎం నివాసంలో జరిగిన భేటీలో దేవాదుల పరిశీలన, కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి బీఆర్ఎస్ నేతల విమర్శలు, కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న పార్లమెంటు సమావేశాలపై సీఎం, మంత్రులు చర్చించారు. ఈ సందర్భంగా సోమవారం దేవాదులకు వెళ్లాలని నిర్ణయించారు. ములుగు జిల్లాలోని దేవాదుల ప్రాజెక్టు నుంచి ప్రస్తుతం రిజర్వాయర్లను నింపే కార్యక్రమం జరుగుతోంది. ఈ నెల 18 కల్లా ప్రాజెక్టు కింద ఉన్న అన్ని రిజర్వాయర్లను నింపాలని సాగునీటి శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఆ కార్యక్రమం పురోగతితోపాటు దేవాదుల పంపుహౌస్, ఇన్‌టేక్ వెల్ పనుల పురోగతిని, నీటి తరలింపు సామర్థ్యాన్ని సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు పరిశీలిస్తారు. అలాగే ఏఐబీపీ పథకం కింద నడుస్తున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ, ఇతర అంశాలపైనా అక్కడే సమీక్ష నిర్వహించనున్నారు. దేవాదుల పర్యటన అనంతరం సీఎం, మంత్రులు తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు.

# విద్యార్థులకు సీఎం విజయ్ సత్కారం..

**చెన్నై- సూర్య వాస్తవం**

**తమిళగ వెట్రి కజగం (టీవీకే) పార్టీ అధినేత, ముఖ్య మంత్రి సి. జోసెఫ్ విజయ్ తన పార్టీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే** విద్యా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా కొనసాగించనున్నారు. 10, 12వ తరగతి స్టేట్ బోర్డ్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన స్వయంగా సత్కరించనున్నారు. ఈ నెలాఖరున లేదా ఆగస్టు మొదటి వారంలో చెన్నై వేదికగా ఈ భారీ కార్యక్రమం జరగనుంది. విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ అవార్డుల ప్రదానోత్సవం జరగడం ఇదే తొలిసారి. 2023లో టీవీకే పార్టీ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించింది. ఇందులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివి, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అగ్రస్థానంలో నిలిచిన మొదటి ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి, వారికి బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలు, ఇతర బహుమతులను అందజేస్తారు. ఈ వేడుకకు విద్యార్థుల తల్లిదండ్రులను కూడా ప్రత్యేకంగా ఆహ్వానించనున్నారు. మహాబలిపురంలోని ఒక ప్రైవేట్ వేదికపై ఈ కార్యక్రమాన్ని నిర్వహించే అవకాశం ఉంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. అర్హులైన విద్యార్థులను గుర్తించి, వారిని కార్యక్రమానికి తీసుకువచ్చే బాధ్యతలను పార్టీ జిల్లా కార్యదర్శులకు అప్పగించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఎన్నికల్లో పార్టీ విజయం సాధించిన నేపథ్యంలో ఈ కార్యక్రమం నిలిచిపోవచ్చనే ఊహాగానాలు వెలువడినప్పటికీ, ఇది ప్రభుత్వ అధికారిక కార్యక్రమం కాదని, కేవలం టీవీకే పార్టీ తరపున వ్యక్తిగత చొరవతోనే కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమ తేదీ, వేదికకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు.

# విశాఖకు జగన్..

**విశాఖ - సూర్య వాస్తవం**

వైసీపీ అధినేత జగన్ విశాఖపట్నంలో పర్యటించనున్నారు. ఇటీవల సముద్రంలో జరిగిన పడవ ప్రమాదంలో గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల కుటుంబాలను ఆయన పరామర్శించనున్నారు. ఈ నెల 14వ తేదీన జగన్ పర్యటన ఖరారైంది. ఈ పర్యటన వివరాలను వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆదివారం వెల్లడించారు. జూలై 14న ఉదయం 10:30 గంటలకు జగన్ విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారని, అక్కడి నుంచి నేరుగా దక్షిణ నియోజకవర్గంలోని జబ్బరుపేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను ఓదార్చుతారని తెలిపారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన కరి చిన్నాతో పాటు అతని కుటుంబ సభ్యులతోనూ జగన్ మాట్లాడతారని చెప్పారు. ఈ సందర్భంగా కేకే రాజు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తీరానికి కేవలం 8 నాటికల్ మైళ్ల దూరంలో ప్రమాదం జరిగినా, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరడానికి 20 గంటల సమయం పట్టిందని ఆరోపించారు. కోస్ట్ గార్డ్, నేవీ, మెరైన్ పోలీసు, మత్స్య, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగానే ఆరుగురు మత్స్యకారులు గల్లంతయ్యారని అన్నారు. గల్లంతైన వారి ఆచూకీ లభించకముందే రెస్క్యూ ఆపరేషన్‌ను నిలిపివేయడాన్ని ఆయన తప్పుబట్టారు. జిల్లాకు చెందిన హోం మంత్రి అనిత బాధితులను పరామర్శించకపోవడం దారుణమన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు ఈ విషాదంపై మౌనంగా ఉన్నారంటూ విమర్శించారు. జూలై 4న గంగవరం తీరానికి 10 నాటికల్ మైళ్ల దూరంలో ఏడుగురు మత్స్యకారులతో వెళ్లిన మర పడవ బోల్తా పడిన విషయం తెలిసిందే. వీరిలో ఒకరు ప్రాణాలతో బయటపడగా, ఆరుగురి ఆచూకీ లభించలేదు. నాలుగు రోజుల పాటు నేవీ, కోస్ట్ గార్డ్ గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో ఆపరేషన్‌ను నిలిపివేశారు.

## సంపాదకీయం

### గందరగోళంగా సర్ ప్రక్రియ !



సర్ ప్రక్రియలో గందరగోళం కనిపిస్తోంది. బిఎల్‌వోలు ఎక్కడా సరిగా కనిపించడం లేదు. ముఖ్యంగా హైదరాబాద్ పట్టణంలో గేటెడ్ కమ్యూ నిటీల్లో వారి ఆచూకీ లేదు. కనీసం సంప్రదించిన దాఖలాలు లేవు. మరోవైపు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ సర్ తుది అంకానికి చేరుకుంది. అధికారికంగా 14వ తేదీ ఆఖరు గడువు అయినా ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్‌వోలకు అందజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. డిజిటలైజేషన్‌కు సమయం కావాల్సి ఉండడంతో అధికారులు ముందస్తు జాగ్రత్త తీసుకుంటున్నారు. మరోవైపు పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నా ప్రజల్లో ఆశించిన స్పందన రావడం లేదని అధికారులు వాపోతుండగా ఆ ఫారాలను పూరించడం కష్టతం మని రాజకీయ పార్టీల ఏజెంట్లు వ్యాఖ్యానిస్తున్నారు. 'సర్' పక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. చివరి రోజులు సర్వర్ సమస్య తలెత్తకుండా చూసుకోవాల్సి ఉంటుంది. ఇకపోతే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి ఒక్కచోటే ఓటు ఉండాలని.. అలాకాకుండా రెండు, అంతకన్నా ఎక్కువ చోట్ల ఓటు ఉంటే అది చట్టవిరుద్ధమని తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్ రెడ్డి తెలిపారు. అలా ఉంటే ఏడాది జైలు శిక్ష, జరిమానా పడుతుందని హెచ్చరించారు. ఇదంతా ఒక ఎత్తయితే ప్రవాసుల ఓట్ల గురించి ఎక్కడా ప్రస్తావించడం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి లక్షల మంది జీవనోపాధి కోసం విదేశాల్లో ఉంటున్నారు. వారు అడపాదడపా వచ్చి వెళు తుంటారు. వారి గురించి ఎన్నికల సంఘం తెలియ చేయాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలోని ఓటరు జాబితా ఆధారంగా.. ఎవరికైనా రెండు చోట్ల ఓటు ఉంటే గుర్తించగలుగుతారు. అదే రెండు రాష్ట్రాల్లో ఉంటే దాన్ని ఈసీఐ గుర్తించాల్సి ఉంటుంది. ఒకే వ్యక్తికి రెండు మూడు చోట్ల ఓట్లు ఉన్నట్లు గుర్తిస్తే, విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని అంటున్నారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చి రెండు చోట్లా ఓటుహక్కు పొందినవారికి ఈసీఐ జారీచేసే నోటీస్ ఆధారంగా... ఏడాది జైలు శిక్షతో పాటు పెనాల్టీ కూడా పడుతుందని సీఈవో హెచ్చరించారు. 'సర్' ముఖ్య ఉద్దేశం.. ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి పేర్లను తొలగించడం, ఇతర తప్పులను సరిదిద్ది జాబితాను పూర్తిస్థాయిలో ఆధునీకరించడం లక్ష్యం. ప్రతి ఒక్క ఓటరూ ఈ పక్రియలో పాల్గొనాల్సిందేనని.. సాధారణ పౌరుల నుంచి సీఎం, పీఎం దాకా ప్రతి ఒక్కరూ ఎన్యూమరేషన్ ఫారం నింపాల్సిందేనని.. ఎవరికీ మినహాయింపులు ఉండవని ఇసి స్పష్టం చేసినా, సామాన్యుల చెంతకు వెళ్లాల్సిన బిఎల్‌వోలు వెళ్లకుంటే దానికి ఎవరు బాధ్యతుల న్నది ప్రశ్న. జీవనోపాధికై గల్ఫ్ తదితర దేశాలకు వెళ్లిన తెలుగువారిలో అత్యధికులు గ్రామీణులే. వీరి విద్యార్హతలు అంతంత మాత్రమే. చిన్న చితకా పనులు చేస్తూ ప్రతి నెలా క్రమం తప్పకుండా కొంత డబ్బును తమ కుటుంబాలకు పంపుతూ స్వదేశంలోని కుటుంబాలను పోషించుకుంటున్నారు. నే ఈ శ్రామిక జనులలో ఎక్కువ భాగం బడుగు, బలహీన వర్గాల వారే. పరాయి దేశంలో నివసిస్తున్నా, వారి మనసంతా సొంతూరు చుట్టే ఉంటుంది. సర్ కార్యక్రమంలో భాగంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మొదలైన ఆ 'సవరణ' పక్రియ అసంఖ్యాక ప్రవాసులపై ప్రత్యక్ష, పరోక్ష ప్రభావం చూపించడం ఖాయం. ఇప్పటి వరకు 'సర్' పూర్తయిన రాష్ట్రాలలో లక్షలాది వలస కార్మికులు, మహిళలు నష్టపోయారు. ఉపాధి వలసలు ఎక్కువగా ఉన్న తెలుగు రాష్ట్రాల్లో 'సర్' ప్రభావం ఉంటుంది. ప్రవాస కార్మికులు అవగాహనా రాహిత్యంతో ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. వారికి సరైన మార్గదర్శకత్వం చేసే నాయకత్వం కూడా కరువయింది. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం, ఒక వ్యక్తి ఒక ప్రదేశంలో ఆరు నెలలకు మించి నివాసం ఉండని పక్షంలో అతను లేదా ఆమె పేరును తొలగించడం ఖాయం. ప్రవాసులే కాదు, రాజకీయ నాయకులు సైతం ఓటరుగా తాము నమోదైన ప్రదేశాలలో నివసిస్తూ ఉండరనేది వేరే విషయం. ప్రవాసులు తమ పాస్‌పోర్టుల్లో చిరునామాగా పేర్కొన్న ప్రదేశంలో ప్రవాస ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉన్నది. అయితే దేశవ్యాప్తంగా ఇలా ప్రవాస ఓటరుగా నమోదు చేసుకునే వారి సంఖ్య స్వల్పమే. ప్రవాస ఓటరుగా నమోదయితే రేషన్‌కార్డు గల్లంతవుతుందనే భయానికి తోడుగా పేర్లు, వయస్సులోని వ్యత్యాసాల కారణంగా ఈ రకమైన నమోదుకు అత్యధికులు ఇష్టపడడం లేదు. ప్రవాసులకు సంబంధించిన ఈ కీలక అంశాలపై సరైన సమాచారంతో సుదూర దేశంలో బతుకు దెరువు పొందుతున్న వారికి స్థానిక నాయకులు దిశా నిర్దేశర చేయవల్సిన అవసరం ఉంది. విదేశాలలో, ప్రత్యేకించి గల్ఫ్ దేశాలలో ఉపాధి పొందుతున్న తెలుగువారు లక్షల సంఖ్యలో ఉన్నారు. ఈ తెలుగు ప్రవాసుల ఉనికి విషయమై ఉభయ తెలుగు రాష్ట్రాల్ లో పాల కులకుగానీ, రాజకీయ పక్షాలకుగానీ ఎలాంటి సూచనలు చేయడం లేదు. ఇలా ఇక్కడ లేని వారి పేర్లు తొలగిస్తే విదేశాల్లో బతుకుదెరువు కోసం పోయిన వారి ఓట్లు గల్లంతు అవుతాయి. తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ లాంటి జిల్లాలోని పలు గ్రామాల వారు అనేక మంది గల్ఫ్ దేశాలలో జీవనోపాధి పొందుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని గ్రామీణ ప్రాంతాలతో పాటు హైదరాబాద్ మహానగర పాతబస్తీలోని అన్ని నియోజకవర్గాల నుంచి కూడా గల్ఫ్‌కు వలస వచ్చిన ఓటర్లు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. వీరంతా జాగ్రత్త పడకపోతే ఓటు గల్లంతు ఖాయం.

# బీజేపీకి చెక్ పెట్టేందుకే పీకే ప్లాన్

**పాట్నా - సూర్య వాస్తవం :** తెరవెనుక ఉంటూ గొప్ప పొలిటికల్ స్ట్రాటజిస్టుగా పేరు తెచ్చుకున్న ప్రశాంత్ కిషోర్ జనసురాజ్ పార్టీ పెట్టి పెద్దగా సక్సెస్ కాలేదు. కానీ ఆయన గత ఎన్నికల్లో పోటీ చేయలేదు. కానీ ఇప్పుడు తానే స్వయంగా ప్రత్యక్ష ఎన్నికల గోదాలోకి దూకారు. ఆయన స్థాపించిన జన సూరాజ్ పార్టీ కోర్ కమిటీ నిర్ణయం ప్రకారం.. బీహార్‌లోని అత్యంత హై-ప్రొఫైల్ అసెంబ్లీ స్థానమైన బాంకీపూర్ ఉపఎన్నికలో ప్రశాంత్ కిషోర్ అభ్యర్థిగా పోటీ చేయబోతున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికై, ఇటీవల రాజ్యసభకు వెళ్లిన సీనియర్ నేత నితిన్ నబీన్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో ఈ స్థానానికి జూలై 30, 2026 న ఉపఎన్నిక జరగనుంది. గత ఏడాది జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో స్వయంగా పోటీ చేయడానికి వెనుకడుగు వేసిన పీకే.. ఇప్పుడు ఏకంగా బీజేపీకి కంచుకోట లాంటి స్థానంలో పోటీకి దిగడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.ప్రశాంత్ కిషోర్ ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక పెద్ద రాజకీయ అనివార్యత దాగి ఉంది. గత 2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో భారీ అంచనాలతో 238 స్థానాల్లో పోటీ చేసిన జన సూరాజ్ పార్టీ.. ఒక్క సీటులో కూడా గెలవలేక పూర్తిగా చాపచుట్టేసింది. ఈ ఘోర పరాజయం వల్ల పీకే సృష్టించిన పొలిటికల్ హైప్ ఒక్కసారిగా కరిగిపోయింది. పార్టీ ఉనికిని కాపాడుకోవాలన్నా, కేడర్‌లో తిరిగి ఉత్సాహం నింపాలన్నా తానే స్వయంగా యుద్ధరంగంలోకి రావాలని పీకే భావించారు. అందుకే, తదుపరి సార్వత్రిక పోరు దాకా ఆగకుండా, ఈ ఉపఎన్నికను తన రాజకీయ



భవితవ్యానికి ఒక యాసిడ్ టెస్ట్ గా మార్చుకున్నారు. 1990ల కాలం నుండి గతంలో పట్నా వెస్ట్ గా ఉన్న ఈ నియోజకవర్గం బీజేపీకి అల్ట్రా-సేఫ్ సీటు. నితిన్ నబీన్ ఇక్కడి నుండి వరుసగా 5 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. పట్నా నగర పరిధిలోని అత్యంత ధనిక, విద్యావంతులైన ఓటర్లు ఉన్న ఈ నియోజకవర్గంలో కమలం జెండాను కాదని వేరే పార్టీ గెలవడం దాదాపు అసాధ్యమనే టాక్ ఉందిఅయితే, ఇంతటి కఠినమైన నియోజకవర్గాన్ని పీకే ఎంచుకోవడం వెనుక కూడా ఒక స్ట్రాటజిస్ట్ మైండ్ దాగి ఉంది. బాంకీపూర్‌లో బీహార్‌లోనే అత్యధికంగా అక్షరాస్యత రేటు ఉంది. ఇక్కడి ఓటర్లు కుల సమీకరణాల కంటే అభ్యర్థి వ్యక్తిగత ఇమేజ్, విద్యార్హతలు చూసి ఓటు వేస్తారనే నమ్మకం పీకేకు ఉంది. బాంకీపూర్ ప్రజలు బీహార్ లోనే అత్యంత చైతన్యవంతులు.. సరైన ప్రత్యామ్నాయం దొరికితే వారు మార్పు కోరుకుంటారు అని పీకే ఓటర్లను నేరుగా ఆకర్షిస్తున్నారు. పైగా, ఈ ఎన్నికను బీహార్ సీఎం సామ్రాట్ చౌదరి నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి ఆర్నెల్ల పాలనపై ఒక రెఫరెండం గా ఆయన అభివర్ణిస్తున్నారు. ఒకవేళ ఇక్కడ ఓడిపోయినా బీజేపీ కోటలో గట్టి ఫైట్ ఇచ్చాం అని చెప్పుకోవచ్చు, పొరపాటున గెలిస్తే మాత్రం బీహార్ రాజకీయాల్లో జన సూరాజ్ తిరుగులేని శక్తిగా అవతరిస్తుందిప్రస్తుత గెలుపు అవకాశాలను అంచనా వేస్తే.. పీకేకు ఇది అత్యంత భారీ రిస్క్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. క్షేత్రస్థాయిలో బీజేపీ ఓటు బ్యాంక్ ఇక్కడ చాలా పటిష్ఠంగా ఉంది. పీకే రాకతో కాంగ్రెస్ నాయకుడు రిషి మిశ్రా లాంటి వారు మద్దతు ప్రకటిస్తున్నప్పటికీ.. అధికారిక ప్రతిపక్షమైన ఆర్జేడీ -కాంగ్రెస్ కూటమి మహాగర్‌బంధన్ ఇక్కడ సొంత అభ్యర్థిని నిలబెడితే ఓట్లు చీలిపోయి బీజేపీకి మరింత లాభం చేకూరుతుంది. పైగా బీహార్ మాజీ మంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్ కొత్తగా పెట్టిన జన్శక్తి జనతా దళ్ తరఫున సామాజిక కార్యకర్త వీణా మాన్విని బరిలోకి దించడం కమలదళానికి రూట్ క్లియర్ చేస్తోంది.ఆగస్టు 3న వచ్చే ఫలితాల్లో పీకే గనుక ఇక్కడ డిపాజిట్ కోల్పోతే.. కేవలం ఢిల్లీ ఏసీ రూముల్లో కూర్చుని స్క్రిప్టులు రాసే కార్పొరేట్ స్ట్రాటజిస్టే తప్ప, గ్రౌండ్ లెవెల్ లీడర్ కాదంటూ ప్రత్యర్థులు ఆయన్ను రాజకీయంగా సమాధి చేసే ప్రమాదం ఉంది. అలా కాకుండా బీజేపీ మెజారిటీని భారీగా తగ్గించినా, లేదా అద్భుతం జరిగి గెలిచినా.. 2025 పరాభవానికి పీకే సరైన రివెంజ్ తీర్చుకున్నట్లవుతుంది. ఈ చావో రేవో పోరాటంలో పీకే మైండ్ గేమ్ గెలుస్తుందా, లేక కమలం కోట నిలుస్తుందా అనేది బీహార్ రాజకీయాల్లో ఇప్పుడు అత్యంత ఉత్కంఠ రేపుతోంది.

# సొంత పార్టీలో తమ్ముడి సౌండ్



**విజయనగరం - సూర్య వాస్తవం :** తెలుగుదేశం పార్టీ అంటే క్రమశిక్షణ అన్నది ప్రధానంగా అంతా మాట్లాడుకుంటారు. వర్గ పోరు కానీ సొంత పార్టీలో సౌండ్ చేయడం లాంటి చర్యలను కానీ పెద్దగా ఉపేక్షించేది ఉండదు. అయితే అన్నీ తెలిసిన సీనియర్ తమ్ముడు ఒకరు ఇటీవల కాలంలో చేస్తున్న హడావుడి పార్టీలో పెద్ద ఎత్తున చర్చగా సాగుతోంది. విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గానికి చెందిన కర్రోతు బంగారు రాజు బలమైన సామాజిక వర్గానికి చెందిన నేత. పలుకుబడి దండీగా ఉంది. మండల పరిషత్ అధ్యక్షుడిగా గతంలో పనిచేసిన అనుభవం ఉంది. ప్రస్తుతం ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్ గా కొనసాగుతున్నారు. ఆయనకు ఎమ్మెల్యే సీటు దక్కాల్సి ఉంది. 2024 లో కూటమి పార్టీలతో పొత్తు వల్ల అనేక సమీకరణల నేపథ్యంలో చాన్స్ జనసేనకు వెళ్ళింది. ఆనాడు ఆయనకు ఎమ్మెల్సీ ఇస్తామని అధినాయకత్వం ప్రామిస్ చేసింది అని అంటారు. కానీ చివరికి దక్కింది నామినేటెడ్ పదవి అన్న బాధ అయితే ఉందిట. ఇక బంగార్రాజు గురించి ఎందుకు ఇపుడు అంతగా చర్చ అంటే తాజాగా భోగాపురం విమానాశ్రయం పనులు పూర్తి అయిన సందర్భంగా ఒక్కసారి అక్కడికి వెళ్ళి ఫైనల్ గా సమీక్షను చేశారు కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు. ఈ సందర్భంగా ఆయన నిర్వహించిన సమావేశంలో ప్రోటోకాల్ ప్రకారం బంగార్రాజుకు పాల్గొనే అవకాశం వచ్చింది. ఈ సందర్భంగా ఆయన స్థానికులకు ఉద్యోగాల సంగతేంటి అని కేంద్ర మంత్రినే నిలదీశారు. మీరు ఇలా వచ్చి అలా వెళ్ళిపోతారు కానీ మేము జనాలకు జవాబు చెప్పుకోవాలి అంటూ బంగార్రాజు మాట్లాడిన తీరు అక్కడ ఉన్న వారిని సైతం ఆశ్చర్యానికి గురి చేసింది అంటున్నారు. సొంత పార్టీకి చెందిన కేంద్ర మంత్రిని అదే పార్టీకి చెందిన స్థానిక నేత ఈ విధంగా నిలదీయడం అంటే ఆలోచించాల్సిందే అంటున్నారు. ఇక విజానగరం జిల్లాలో జరిగే డీఆర్సీ సమావేశంలో కూడా ఈ విధంగానే బంగార్రాజు గొంతు పెంచి ప్రజా సమస్యల పేరుతో అధికారులను గట్టిగానే నిలదీయడం చేస్తున్నారు అని అంటున్నారు. అంతే కాదు నెల్లిమర్ల పంచాయతీ సమావేశంలో కూడా తన అధికార హవాను ఆయన గట్టిగానే చూపించారు అని అంటున్నారు. దీంతో పాటు ఆయన నెల్లిమర్ల జనసేన ఎమ్మెల్యే లోకం మాధవితో సమాంతరంగా అధికార దర్పం చాటుకుంటున్నారు అని ప్రచారం సాగుతోంది. ఎమ్మెల్యే వర్సెస్ టీడీపీ అన్నట్లుగా ఉంటుంది. దాంతో ఇక్కడ కూటమిలో వర్గ పోరు సాగుతోంది అని అంటున్నారు. బంగార్రాజుకు జనంలో పలుకుబడి ఉంది. ఆయన స్థానికంగా గట్టి నాయకుడే. స్థానికుల డిమాండ్లను అధికారుల మంత్రుల ముందు పెట్టి చేయించుకుంటారు అని అంటున్నారు. కానీ సొంత పార్టీ నేతలను కేంద్ర రాష్ట్ర మంత్రులను ఇరకాటంలో పెట్టే విధంగా ఆయన వ్యవహరిస్తున్న తీరు మాత్రం చర్చనీయాంశం అవుతోంది. తాను ఎమ్మెల్యే స్థాయి నేతను అని చాటుకునేందుకు తన ఇమేజ్ ని పెంచుకునేందుకు ఇలా చేస్తున్నారు అని సొంత పార్టీలో గుసగుసలు పోతున్నారు. తనకు ఇలాగైతేనే మంచి గుర్తింపు లభిస్తుందని తన హవా ఎంటో పెద్దలకు తెలుస్తుందని ఆయన భావిస్తున్నారు అని అంటున్నారు. అయితే ఈ విధంగా అతి చేస్తే రేపటి రోజున ఇబ్బందులు కూడా వస్తాయని అంటున్నారు. పార్టీ అన్నింటి కన్నా క్రమశిక్షణకే పెద్ద పీట వేస్తుందని కూడా గుర్తు చేస్తున్నారు పార్టీ నేతలు. మరి బంగార్రాజు 2029 ఎమ్మెల్యే కావాలనుకుంటే ఈ హడావుడి అవసరమా అన్న ప్రశ్నలు అయితే పసుపు పార్టీలో వస్తున్నాయి

# ఒక అడుగు ముందుకు..రెండడుగులు వెనక్కి

**విశాఖపట్టణం - సూర్య వాస్తవం :** పీవీఎన్.మాధవ్ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సుపరిచితమైన పేరు. కమలం పార్టీ ఆంధ్రప్రదేశ్ సారథిగా సరిగ్గా ఏడాది క్రితం బాధ్యతలు చేపట్టారు. టీడీపీ, బీజేపీ, జనసేన నేతృత్వంలో ఏపీలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2025 జూలై 8న ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. దగ్గుబాటి పురంధేశ్వరి నుంచి ఈ హోదా అందుకున్న ఆయన ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ నుంచి రాజకీయ జీవితం ప్రారంభించిన యువ నాయకుడు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎంబీఏ చదివిన ఆయన 2017లో గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఉత్తరాంధ్రకు చెందిన బీసీ వర్గానికి చెందిన ఆయన తండ్రి పీవీ చలపతిరావు ఏకీకృత ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ కుటుంబ వారసత్వం, సంస్థాగత అనుభవం ఆయన నియామకానికి కారణమయ్యాయి. విజయవాడలో ఏబీవీపీ స్థాపన దినోత్సవం సందర్భంగా భారీ ర్యాలీలో మాధవ్ అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌కు పూలమాల వేసి, తెలుగు కవి విశ్వనాథ సత్యనారాయణ విగ్రహానికి మాలలు వేశారు. లెనిన్ సెంటర్‌ను విశ్వనాథ సత్యనారాయణ పేరిట మార్చాలని డిమాండ్ చేశారు. 'పార్టీ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లి, గ్రాస్‌రూట్ స్థాయిలో బలోపేతం చేస్తాం. ప్రతి కార్యకర్త నాయకుడిలా భావించి, క్రమశిక్షణతో, జాతీయ స్ఫూర్తితో పనిచేయాలి' అని



ప్రతిజ్ఞ చేశారు. అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పురంధేశ్వరి ఆయన నాయకత్వంలో పార్టీ మరింత ఎదుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.మాధవ్ నాయకత్వంలో బీజేపీ సంస్థాగతంగా చురుకుగా ముందుకు సాగుతోంది. 2026 జూన్ 30న రాష్ట్రంలోని 28 జిల్లాలకు ఇన్‌ఛార్జిలను నియమించారు. ఇది పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలపరచడానికి చేపట్టిన చర్య. 'మన ఊరు ? మన జెండా' కార్యశాలలు నిర్వహించి, పార్టీ సిద్ధాంతాలు, సేవా కార్యక్రమాలను గ్రామ గ్రామానికి, ఇంటింటికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. కొత్త జిల్లాలతో కమిటీలు ఏర్పాటు చేసి, గ్రామ స్థాయి నుంచి బూత్ వరకు నిర్మాణం పటిష్టం చేశారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.కూటమి ప్రభుత్వంలో బీజేపీకి నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల టికెట్ల విషయంలో క్యాడర్‌లో అసంతృప్తి ఉందని ముందుగా చెప్పినట్లే ఉంది. అయితే మాధవ్ నాయకత్వంలో బీజేపీ మరింత ప్రాధాన్యత సాధించాలని, ఎమ్మెల్యేలు, ఎంపీల సంఖ్యను రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకురావడం, కూటమిలో బీజేపీకి మరిన్ని అవకాశాలు కల్పించడం వైపు దృష్టి పెట్టారు. రెండేళ్ల కూటమి పాలనలో రాజ్యసభలో రెండు సీట్లు, ఒక ఎమ్మెల్సీ సీటు దక్కినప్పటికీ, మరిన్ని కీలక పదవులు కోరుతున్నారు.2026 జూన్‌లో తిరుపతిలో ఎన్డీఏ విజయోత్సవ సభలో మాధవ్ మాట్లాడుతూ, 'డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల రాష్ట్ర అభివద్ధి వేగంగా జరుగుతోంది. రూ.14 లక్షల కోట్ల ప్రాజెక్టులు వాస్తవరూపం దాలుస్తున్నాయి' అని చెప్పారు. కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కూటమి విజయాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ నేతత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా దూసుకు పోతోందని ప్రశంసించారు. యువతను వికసిత భారత్ కోసం రాజకీయాల్లోకి రావాలని, సాంకేతికత, ఆవిష్కరణలపై దష్టి పెట్టాలని సూచించారు.

## హంద్రీ-నీవా కాలువ వెడల్పు పనులను

# సకాలంలో పూర్తి చేస్తాం

**- భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్**

**- మొత్తం మూడు ప్యాకేజీల కింద భారీ నిధులు మంజూరు ఏడాదిన్నరలో పనులు పూర్తి చేయాలని సంకల్పం**

**శ్రీ సత్య సాయి బ్యూరో - సూర్య వాస్తవం :** హంద్రీనీవా కాలువ వెడల్పులను సకాలంలో పూర్తి చేస్తామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఆదివారం శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం మండలం రాచపల్లి వద్ద హంద్రీ–నీవా సుజల స్రవంతి కాలువ వెడల్పు పనులకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసి తన చేతుల మీదుగా ఈ పనులకు శాస్త్రోక్తంగా భూమిపూజ చేశారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఇతర ఉన్నతాధికారులు మరియు ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, హిందూపురం పార్లమెంట్ సభ్యులు బి.కె. పార్థసారథి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఉమ్మడి





అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలు ఎం.ఎస్. రాజు, కందికుంట వెంకటప్రసాద్ ఆలిమినేని సురేంద్రబాబు తదితర పాల్గొన్నారు. ఈ సందర్భం గా ఏర్పాటు చేసిన సమావేశంలో రామానాయుడు మాట్లాడుతూ ఈ కాలువ వెడల్పు పనులను రాబోయే ఏడాదిన్నర (18 నెలల) కాలపరిమితి లోపు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టును మొత్తం మూడు ప్యాకేజీల కింద విభజించి, రికార్డు స్థాయిలో నిధులను మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు. మొదటి ప్యాకేజ్ 0 కిలోమీటర్ల నుండి 8.6 కిలోమీటర్ల వరకు పనుల కోసం రూ. 159.20 కోట్లు మంజూరు చేశామన్నారు. రెండవ ప్యాకేజ్ 20 కిలోమీటర్ల నుండి 53.3 కిలోమీటర్ల వరకు విస్తరించే పనులకు రూ. 477.18 కోట్లు కేటాయించామని పేర్కొన్నారు. మూడవ ప్యాకేజ్ 53.3 కిలోమీటర్ల నుండి 71 కిలోమీటర్ల పరిధిలోని పనుల నిమిత్తం రూ. 154 కోట్లు నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ కాలువ వెడల్పు పనులు పూర్తయితే హిందూపురం నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటి ఎద్దడి శాశ్వతంగా తీరుతుందని, పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, హిందూపూర్ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ క్రాంతి ,హిందూపూర్ తహసీల్దార్ వెంకటేశు,ఇరిగేషన్ శాఖ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## రామగిరిలో మరుగు దొడ్ల స్థలం కబ్జా



**పామిడి - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా పామిడి మండలం రామగిరి గ్రామంలో దాదాపు శతాబ్ది కాలంగా ఏర్పాటుచేసిన మరుగు దొడ్డి స్థలాన్ని కబ్జా చేశారు. రామగిరి గ్రామంలో దాదాపు శతాబ్ది కాలం క్రితం ఏర్పాటుచేసిన 8 సెంట్లు బహిర్భూమి స్థలాన్ని కబ్జా చేసి రూములు నిర్మించారు. కొందరు నాయకులు రామాలయాన్ని నిర్మిస్తామని ఫోటోలు పెట్టి పూజలు నిర్వహించి అనంతరం వేరొకరితో కబ్జా చేయించి అనంతరం తాము పొందే విధంగా కుట్రపూరితమైన వ్యూహాలతో రూములు నేర్పిస్తున్నారు. అడ్డు తగిలిన వారితో అవసరమైతే అంగన్వాడీ సెంటర్ కు కొంత స్థలాన్ని కేటాయిస్తామని నమ్మ పలుకుతున్నారు. అధికారులు అడ్డుకోకుండా ఉండడానికి ఉన్నతస్థాయి నాయకుల పేర్లు చెప్పి మభ్యపెడుతున్నారు. స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు అధికారులు ఇటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని పోస్టర్లు అందించినా బెకాతార్ చేస్తూ నిర్మాణాలు ముమ్మరం చేశారు.ఏది ఏమైనప్పటికీ అప్పటి బహిర్భూమి ఉన్న ప్రాంతానికి విలువ రావడంతో కబ్జా ఊరికి ఉపయోగపడాల్సిన స్థలాన్ని కబ్జా చేశారు ప్రజాభిప్రాయానికి అనుగుణంగా దీనిపై స్థానిక ఎమ్మెల్యే స్పందించి కబ్జా చేసిన చేస్తున్న చేయిస్తున్న నాయకులను పక్కనపెట్టి రామ మందిరాన్ని నిర్మించి ప్రజల మన్ననలను పొందే విధంగా చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. అధికారులు ఏటువంటి రాజకీయ ప్రలోభాలకు లొంగకుండా ప్రజాభిప్రాయానికి విలువనిచ్చి తగిన ఏర్పాటు చేయాలని పలువురు అభిప్రాయ వ్యక్తం చేస్తున్నారు.

## గ్రూప్ -1 ఆఫీసర్ తేజ్యోష్ణకు ఉద్యోగోన్నతి

**- పెనుకొండ డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్‌గా నియామకం**



**అనంతపురం - సూర్య వాస్తవం :** విధి నిర్వహణలో నీతి, నిజా యతీ, నిబద్ధతతో సేవలు అందించిన గ్రూప్ -1 ఆఫీసర్ తేజ్యోష్ణకు సముచిత స్థానం దక్కింది. డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్(డీడీఓ)గా ఆమెకు ఉద్యోగోన్నతి లభించింది. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ డీడీఓగా ఆమెను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమెకు జెడ్పీ ఛైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, సీఈఓ విజయలక్ష్మి అభినందనలు తెలిపారు.

**తేజ్యోష్ణ ఉద్యోగ ప్రస్థానం ఇలా..**

అనంతపురం జిల్లాకు చెందిన తేజ్యోష్ణ 2018 గ్రూప్ -1 ఆఫీసర్ గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. తొలుత అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం ఎంపీడీఓగా నియమితులయ్యారు. అక్కడ సమర్థవంతంగా సేవలు అందించారు. అక్కడి నుంచి వైఎస్సార్ కడప జిల్లా సింహాద్రిపురం, లింగాల మండలాల్లో పని చేశారు. అక్కడి నుంచి మళ్లీ అనంతపురం జిల్లా పామిడి ఎంపీడీఓగా వచ్చారు. ఎక్కడ పని చేసినా సమర్థవంతమైన అధికారిణిగా గుర్తింపు తెచ్చుకున్నారు.

**తేజ్యోష్ణ సేవలకు దక్కిన గుర్తింపు**

విధి నిర్వహణలో తేజ్యోష్ణ అందించిన సేవలకు గుర్తింపుగా ఆమెకు ఇప్పటికే ఆరు అవార్డులు లభించాయి. మరెన్నో ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఆమె సమర్థతను దృష్టిలో పెట్టుకొని.. గుంతకల్లు ఇంచార్జ్ డీడీఓగా జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి నియమించారు. తాజాగా ఆమెకు రెగ్యులర్ డీడీఓగా ఉద్యోగోన్నతి కల్పించి పెనుకొండ డివిజన్ కు బదిలీ చేశారు.

## అనంత యాసకు పట్టంగట్టిన మందల సురేష్ "అతుకుల గుడిసె"

**అనంతపురం - సూర్య వాస్తవం :** నవ యువ రచయిత మందల సురేష్ రాసిన తొలి నవల "అతుకుల గుడిసె" లో అనంతపురం జిల్లా యాసకు, రాయలసీమ మాండలికానికి పెద్దపీట వేశారని పలువురు సాహితీవేత్తలు ప్రశంసించారు. దళిత, బహుజన, అస్తిత్వ జీవిత చిత్రణతో, అణగారిన వర్గాల ఆత్మఘోషను ఈ నవలలో రచ యిత ఎంతో శక్తివంతంగా అక్షరీకరించారని వక్తలు కొనియాడారు. జిల్లా రచయితల సంఘం (జిరసం), "దేగ" మాసపత్రిక టీమ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్.జి.ఓ హోమ్‌లో ఈ నవలావిష్కరణ సభ ఘనంగా జరిగింది.

**అట్టహాసంగా నవలావిష్కరణ**

ప్రముఖ కవి, సాహితీ విశ్లేషకులు తూమచర్ల రాజారామ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రముఖ కవి, కథా నిధి డా. శాంతి నారాయణ నవలను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ నాటక రచయిత డా. వి.ఆర్. రాసాని మాట్లాడుతూ, సమీప భవిష్యత్తులో రాయలసీమ నుంచి ఒక గొప్ప నవలాకారుడు రానున్నారనే నమ్మకాన్ని ఈ నవల కలిగిస్తోందన్నారు. ప్రముఖ సాహితీ విమర్శకులు డా. కె. నాగేశ్వరాచారి నవలపై అద్భుతమైన సమీక్షను అందించారు.

**హాజరైన ప్రముఖులు**

ఈ సాహితీ ఉత్సవంలో విశిష్ట అతిథులుగా ప్రముఖ దళిత సాహిత్య కవి వేముల ఎల్లయ్య (హైదరాబాద్), వైఎస్ఆర్సిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, శ్రీనివాస విద్యానికేతన్ కరస్పాండెంట్ వి. శ్రీనివాసులు పాల్గొన్నారు. గౌరవ అతిథులుగా సీనియర్ రచయిత సడ్లపల్లి చిదంబర రెడ్డి, జిరసం గౌరవాధ్యక్షులు డా. జెన్నె ఆనంద్ కుమార్, "దేగ" పత్రిక అధినేత శీర్పి చంద్రశేఖర్, ఎమ్.ఎచ్ రాయుడు, రాయలసీమ విద్యావంతుల వేదిక ప్రతినిధి కంచపు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



**ఆకట్టుకున్న సభ నిర్వహణ**

దేగ టీమ్ సభ్యులు షేక్ ఇక్రమ్ బాష సభకు ఆహ్వానం పలకగా, మొండి వెంకటేష్ ఆలపించిన ఉద్దీపన గీతం అందరినీ అలరించింది. జిరసం అధ్యక్షులు కొత్తపల్లి సురేష్ పర్యవేక్షణలో, కోటిగారి వన్నప్ప, గోసల నారాయణస్వామి సభను చక్కగా సమ న్వయం చేశారు. రచయిత మందల సురేష్ తన స్పందనను తెలియజేస్తూ, జయంతి పబ్లికేషన్స్ ద్వారా పుస్తకాన్ని తెచ్చినందుకు, జిరసం, దేగ టీమ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంత హక్కుల పోరాట సంఘం నేత సోమర రాహుల్ వందన సమర్పణతో సభ ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలువురు కవులు, రచయితలు, ఉపాధ్యాయులు మరియు సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైసీపీ వికృత రాజకీయాలను ఖండిస్తున్నాం

ఉరవకొండ - సూర్య వాస్తవం: జనసేన పార్టీ అధ్యక్షులు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు భుజానికి జరిగిన శస్త్ర చికిత్స ఆ దేవుడి దయతో విజయవంతం అవడం ఆనందంగా ఉంది. అయన త్వరగా కోలుకోవాలని ఉరవకొండ జనసేన నాయ కులు, వీరమహిళలు, కార్యకర్తలు, ఆ దేవుడిని ప్రార్థిస్తున్నాము. రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) నడుపుతున్న వికృత రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తున్నామని, కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టే చౌకబారు రాజకీయాలను ఆ పార్టీ వెంటనే మానుకోవాలని జనసేన పార్టీ నియోజకవర్గం ఇంచార్జి గౌతమ్ కుమార్ డిమాండ్ చేశారు. ఇటీవల కొందరు వ్యక్తులు సామాజిక మాధ్యమాలు, బహిరంగ వేదికల ద్వారా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై చేస్తున్న వ్యక్తిగత, అనుచిత వ్యాఖ్యలను వైసీపీ నేతలు ప్రత్యక్షంగా, పరోక్షంగా సమర్థించ డాన్ని ఆయన తప్పు బట్టారు. ఈ రకమైన ధోరణి సమాజంలో మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉందంటూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

**విద్వేష రాజకీయాలు అత్యంత ప్రమాదకరం**

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ విధానాలను, అభివృద్ధిని ప్రతిపక్షాలు నిర్మాణాత్మకంగా ప్రశ్నించడం సహజమని, కానీ ప్రతి



సంఘటనకు కులం, మతం రంగు పులిమి రాజకీయ లబ్ధి పొందాలని చూడడం అత్యంత ప్రమాదకరమని గౌతమ్ కుమార్ హెచ్చరించారు. హిందూ దేవతలపై, జాతీయ నాయకులపై, దేశ సార్వభౌమత్వంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన వారిని సైతం వైసీపీ నేతలు వెనుకేసుకురావడం ప్రజల్లో పలు అనుమానాలకు తావిస్తోందన్నారు.

**నేరస్థుడికి కులం, మతం ఉండవు**

వివిధ ఘటనలపై చట్టపరమైన విచారణలు జరుగుతుంటే, నిందితులకు కుల కోణంలో మద్దతు ఇస్తూ ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం సమాజంలో విభేదాలను పెంచడమేనని విమర్శించారు. చట్టం తన పని తాను చేసుకు పోతుందని, నేరం చేసిన వ్యక్తికి కులం, మతం ఆధారంగా మద్దతు ఇవ్వడం సరైన రాజకీయ విధానం కాదని హితవు పలికారు.

**జనసేన లక్ష్యం అదే..**

కుల, మత విభజనలు లేని సామరస్య సమాజ నిర్మాణమే జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రధాన లక్ష్యమని గౌతమ్ కుమార్ స్పష్టం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అన్ని వర్గాలకు సమానంగా అందిస్తోందని, భవిష్యత్ తరాలు విద్వేషాలు లేని సమాజాన్ని కోరుకుంటున్నాయని తెలిపారు. ఇకనైనా వైసీపీ ఇలాంటి విభజన రాజకీయాలు విరమించుకుని, ప్రజా సమస్యలు, అభివృద్ధి, పరిపాలన అంశాలపైనే చర్చలు జరపాలని ఆయన కోరారు.

## తోపుదుర్తి రాజశేఖరరెడ్డిని పరామర్శించిన వైసీపీ ముఖ్య నేతలు



**ఉరవకొండ - సూర్య వాస్తవం ప్రతినిధి :** తోపుదుర్తి గ్రామంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తోపుదుర్తి రాజశేఖరరెడ్డి స్వగృహంలో వైఎస్సార్‌సీపీ కీలక నేతలు ఉరవకొండ నియోజకవర్గ ఇంచార్జ్ వై. విశ్వేశ్వర రెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సి.పి. వీరన్న, మరియు వెన్నపూస రవీంద్రా రెడ్డి తోపుదుర్తి రాజశేఖరరెడ్డిని వారి నివాసంలో పరా మర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, స్థానిక నియోజకవర్గ పరిణామాలపై నేతలు కొద్దిసేపు చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా విజయవంతంగా పూర్తి చేయాలి..

- అనంతపురం నియోజకవర్గ టిడిపి నాయకులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు
- అర్హులైన ప్రతి ఓటరు నమోదుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలి.. :ఎమ్మెల్యే దగ్గుపాటి



**అనంతపురం - సూర్యవాస్తవం :**ఎస్ఐఆర్ కార్యక్రమం ముగియడానికి మరో మూడు రోజులు మాత్రమే మిగిలి ఉన్న నేప థ్యంలో అనంతపురం అర్బన్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులతో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదివారం ఉదయం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో క్లస్టర్, కో-క్లస్టర్, యూనిట్, కో-యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లు, రాష్ట్ర, జిల్లా, నగర కమిటీల నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిపై ఎమ్మెల్యే సమగ్ర సమీక్ష నిర్వహించారు. జూలై 14వ తేదీలోపు నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తి చేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఎన్యూమరేషన్ ఫారాలను వేగంగా సేకరించి సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని, 2002 ఓటరు జాబితాను పూర్తిస్థాయిలో పరిశీలించి అర్హులైన ప్రతి ఓటరు వివరాలు నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన 12 రకాల గుర్తింపు పత్రాల్లో ఏవైనా రెండు పత్రాలను సమర్పించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో ఎలాంటి అపోహలు లేకుండా పార్టీ నాయకులు వాస్తవాలను వివరించాలని సూచించారు. ఎస్ఐఆర్ పేరుతో ఓట్లను తొలగిస్తున్నారనే ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారమే ప్రతి దరఖాస్తును అధికారులు పరిశీలిస్తున్నారని తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమానికి మిగిలిన మూడు రోజులు అత్యంత కీలకమైనవని పేర్కొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, నియోజకవర్గంలోని క్లస్టర్, కో-క్లస్టర్, యూనిట్, కో-యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లు ప్రత్యేక బాధ్యతతో పనిచేసి అర్హత కలిగిన ప్రతి ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేసి జూలై 14లోపు నిర్దేశించిన లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు సూచించారు.

## ఎస్ఐ నాగప్పకు ఆత్మీయ పదవీ విరమణ వేడుక



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలోని పోలీస్ స్టేషన్ నందు ఎస్సై నాగప్ప విధులు నిర్వహిస్తూ జూన్ 30వ తారీకు పదవీ విరమణ జరిగింది. అనంతరం గుత్తి పట్టణం తాడిపత్రి రోడ్డు చివార్లలోని స్పందన ఫంక్షన్ హాల్ నందు ఆదివా రం డిఎస్పి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఐ రామారావు అధ్యక్షతన ఎస్సైగా రిటైర్ అయిన నాగప్ప పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రిటైర్డ్ ఎస్సైనాగప్పకు శాలువాలు కప్పి పూలదండలతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సురేష్,అమీర్ ఖాన్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 18న శ్రీవారి ఆర్జితసేవల అక్టోబరు నెల కోటా విడుదల

**తిరుమల - సూర్యవాస్తవం :** అక్టోబరు నెలకు సంబంధించిన తిరుమల శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల కోటాను టీటీడీ ఈనెల 18వ తేదీన ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవల లక్కీడిప్ కోటా ఉదయం 10 గంటలకు విడుదల కానున్నాయి. దీనికోసం 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకుని ఆ తర్వాత ఎంపికైన భక్తులు టికెట్లు పొందవచ్చు. ఇక 21న కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను ఉదయం 10 గంటలకు.., వర్చువల్ సేవలు, వాటి దర్శన టికెట్లు మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. అలాగే 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్లు, ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు టిక్కెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగులు, ఆరోగ్య సమస్యలు ఉన్న భక్తుల టోకెన్లు జారీ చేస్తారు. 24న ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో గదుల కోటాను విడుదల చేయనున్నారు. భక్తులు 'టీటీదేవస్థానమ్స్.ఏపీ.జీవోవీ.ఇన్' వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా పొందవచ్చు.

### 14, 17 తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాల రద్దు

తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 14న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 17న ఆణివార ఆస్థానం జరగనున్నాయి. ఈక్రమంలో ఈ రెండ్రోజుల్లో ప్రొటోకాల్ పరిధిలో ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేసినట్టు టీటీడీ ప్రకటించింది. ముందురోజు అంటే 13, 16వ తేదీల్లో బ్రేక్ దర్శనాలకు ఎలాంటి సిఫార్సు లేఖలు స్వీకరించబోమని స్పష్టం చేసింది. 17వ తేదీన కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలు కూడా రద్దయ్యాయి. కాగా, వరుస సెలవుల నేపథ్యంలో తిరుమల క్షేత్రం భక్తుల రద్దీతో కిటకిటలాడుతోంది. 10, 11 తేదీల్లో 1,65,282 మంది శ్రీవారిని దర్శించుకున్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించండి

- జ్ఞాన సుధ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్





**శ్రీ సత్య సాయి బ్యూరో - సూర్య వాస్తవం :** విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణం మూర్తిపల్లి ఆర్పీ స్ట్రీట్ లో నూతనంగా నిర్మించిన లిలిజ్ఞాన సుధ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లిను శాసనసభ్యులు కంది కుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ, నాణ్యమైన విద్య ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. భావి తరాలకు ఉత్తమ విద్యను అందించేందుకు విద్యాసంస్థలు కీలక పాత్ర పోషించాలని అన్నారు. విద్యార్థుల్లో క్రమ శిక్షణ, విలువలు, ప్రతిభను పెంపొందించేలా పాఠశాల యాజమాన్యం కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన విద్యా సంస్థను ఏర్పాటు చేసిన పాఠశాల యాజమాన్యాన్ని ఎమ్మెల్యే అభినందిస్తూ, విద్యారంగంలో మరిన్ని విజయాలు సాధించాలని హృదయపూర్వక శు భాకాంక్షలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థిని విద్యార్థులకు ప్రాణ్యమైన విద్యను బోధించి వారిని ఉత్తమ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని ఆయన పేర్కొన్నారు. ముందుగా ఎమ్మెల్యేకి జ్ఞాన సుధా ఇంగ్లీష్ మీడియం స్కూల్ హెడ్మాస్టర్ అబ్బోల్ల మస్తాన్ కదిరి మండలం టిడిపి కన్వీనర్ హరి ఇతర పాఠశాల సిబ్బంది సుస్వాగతం పలికారు. అనంతరం స్కూల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి విద్యార్థిని విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జయసుధ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన..

- కంటి చూపు లేకుంటే జీవితం అంధకారమే...
- పర్యావరణ పరిరక్షణ కొరకు 100 మొక్కలను పంపిణీ



**పామిడి - సూర్యవాస్తవం :** పామిడి పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ల మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు, శంకర కంటి ఆసుపత్రి బెంగుళూరు కంటి వైద్య నిపుణులు డాక్టర్ మహిత మాట్లాడుతూ కంటి సంరక్షణ కొరకు ముందు జాగ్రత్తలు మరియు నివారణ చర్యలు గురించి తెలియజేసారు. బ్యాక్టీరియా వైరస్, ఫంగస్, సూక్ష్మ క్రిముల నుండి కళ్ళను రక్షించుకోవాలని తెలియజేశారు. కళ్ళు మన శరీరంలో చాలా సున్నితమైన అవయవాలు వాటిని చాలా జాగ్రత్తగా సంరక్షించుకోవా లన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి కోశాధికారి మాట్లా డుతూ కళ్ళు మానవునికి దేవుడిచ్చిన అత్యంత బహుమతి అని అన్నారు. ఈ అందమైన ప్రపంచాన్ని చూపించే అవయవాలు కళ్ళు అన్నారు. కంటి చూపు బాగుంటే ఎవరి పనులు వారే చూసుకోగలరని వ్యాఖ్యానించారు. కంటి వైద్య నిపుణులు డాక్టర మహిత కంటి వైద్య శిబిరానికి వచ్చిన 150. మందిని పరీక్షించి అందులో 67 మందిని. కంటి ఆపరేషన్ కు రెఫర్ చేశారు. ఈ శిబిరానికి వచ్చిన వారికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యం లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ కొరకు నూరు 100 మొక్కలను పంపిణీ చేయడం జరిగింది .ఈ వైద్య శిబిరం నందు డిస్టిక్ చైర్ పర్సన్స్ డాక్టర్ శాంతి ప్రియ డాక్టర్ మురళీకృష్ణ జయరాం రావు కమిత్కర్ రఘువీర్ రావు మానవ హక్కుల కమిషన్, పర్యావరణ పరిరక్షణ దక్షణ భారత దేశ సెక్రటరీ ఆవుల ప్రసాద్, లయన్స్ క్లబ్ కోశాధికారి డి. షేక్షావలి, ఉపకార్యదర్శి ముం డే షేక్షావలి. క్లబ్ నిర్వాహకుడు ఆర్.ఎం.పి వైద్యులు గంగ శేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పట్రా నరేష్ కుమార్, డైరెక్టర్స్ పట్ర రాకేష్, అంజి నాయక్ తూర్పింటి ప్రసాద్ నల్లయ్య శంకర కంటి ఆసుపత్రి ఆర్గనైజింగ్ మేనేజర్ శివ, శంకర హాస్పిటల్ సిబ్బంది, లక్ష్మీ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



# రాయలసీమలో ఎకరా రూ.1.50 కోట్లు

**అనంతపురం - సూర్యవాస్తవం :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెట్టుబడుల ఆకర్షణ కోసం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో దూసుకుపోతోంది. కొత్త ఇండస్ట్రియల్ పాలసీ, ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానంతో పరిశ్రమలు, కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మారుతున్న పరిస్థితులకు తగిన విధంగా వ్యూహాలతో ముందుకు సాగుతోంది. తాజాగా ఏపీ ప్రభుత్వం ఇండస్ట్రియల్ కారిడార్లలో అభివృద్ధి చేస్తున్న మూడు నోడ్‌లలో పరిశ్రమ లకు భూమి కేటాయించడానికి ప్రత్యేకంగా పాలసీని తీసుకొచ్చింది. విశాఖపట్నం-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు, చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ లలో ఉన్న కొప్పర్తి, ఓర్వకల్లు, కృష్ణపట్నం నోడ్‌లలో ఉన్న పరిశ్రమలకు ఈ పాలసీ వర్తిస్తుంది. ఏపీ ప్రభుత్వం ఇండస్ట్రియల్ కారిడార్లలోని నోడ్‌లకు సంబంధించి పరిశ్రమలకు కేటాయించే భూముల ధరల్ని ఖరారు చేసింది. అత్యధికంగా నెల్లూరు జిల్లా క్రిస్ సిటీలో ఎకరా భూమిని రూ.1.74 కోట్లకు విక్రయించాలని నిర్ణయం తీసుకున్నారు. కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లులోని నోడ్‌లో ఎకరా రూ.1.50 కోట్లుగా ఫిక్స్ చేశారు. కడప జిల్లాలో ఎకరా రూ.1.25 కోట్లు ఖరారు చేశారు. కేంద్రం నిర్ణయించిన ధరలే ఫిక్స్ చేశారు. ఏపీ పొరుగున్న ఉన్న కర్ణాటకతో పాటుగా మహారాష్ట్ర, గుజరాత్‌లో కూడా ఇలాగే క్లస్టర్లలో పరిశ్రమలకు భూములకు సంబంధించి ధరలు



ఖరారు చేశారు. గుజరాత్, ముంబైలో ఎకార రూ.2.25 కోట్లకు ఫిక్స్ చేశారు. పారిశ్రామికవేత్తల నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదని చెబుతున్నారు.రాష్ట్రంలోని ఇండస్ట్రియల్ నోడ్‌లకు సమీపంలో ఎకరా రూ.20 నుంచి 30 లక్షలకు భూములు అందిస్తున్నట్లు కేంద్రం దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. ఈ ధరలతో పోలిస్తే ఇండస్ట్రియల్ నోడ్‌లలో భూముల ధరలు 3 నుంచి 4 రెట్లు ఎక్కువగా ఉందని గుర్తు చేశారు. దీంతో కేంద్రం ఈ నోడ్‌లలో ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తునందున ఈ ఖర్చును భరించి రాబట్టేందుకు వీలుగా కేంద్రం ధరల్ని ఫిక్స్ చేసింది. కాకపోతే ముందుకుగా వచ్చే ప్రాజెక్టులకు మాత్రం 25శాతం రాయితీ ఇచ్చేందుకు అనుమతించింది.. అది కూడా ప్రోత్సాహకం కింద ఇస్తారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఇండస్ట్రియల్ కారిడార్లకు సంబంధించిన భూముల్ని ఏ ధరకు విక్రయించాలో తమ నిర్ణయానికి అనుగుణంగా వ్యవహరించాలని, ఐఆర్ఆర్‌కు సంబంధించి కేంద్రం నిబంధన విధించింది.. ఈ ధరలకే భూములు విక్రయించాల్సి ఉంటుందంటున్నారు అధికారులు.క్రిస్ సిటీలో ముందుగా ఈ భూములు కేటాయింపు ప్రారంభించాలని ప్లాన్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొప్పర్తి, ఓర్వకల్లు, కృష్ణపట్నం నోడ్‌లలో కలిపి దశల వారీగా 29,254 ఎకరాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోంది. రాష్ట్రం భూముల్ని కేటాయిస్తే.. కేంద్ర సంస్థ నిక్‌డిక్ట్ (నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్) అభివృద్ధి చేస్తోంది. మూడు నోడ్‌లలో కలిపి మొదటి దశలో భాగంగా మౌలిక సదుపాయాలకు మొత్తం 7,225 ఎకరాల్లో దాదాపు రూ.3,300 కోట్లు నిక్‌డిక్ట్ ఖర్చు చేస్తోంది.

# "గురువు వెలిగించిన జ్ఞానదీపం కాలగమనంలో ఎన్నో జీవితాలను ప్రకాశింపజేస్తుంది

## - గురువులకు ఘన సత్కారం.. ఆత్మీయతను చాటిన 1990--91 బ్యాచ్ పూర్వ విద్యార్థుల కలయిక



**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1990--91 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు, విద్యార్థినుల ఆత్మీయ కలయిక ఆదివారం అత్యంత ఉత్సాహభరితంగా, భావోద్వేగపూరిత వాతావరణంలో జరిగింది. మూడు దశాబ్దాలకు పైగా కాలం గడిచినా, గురు–శిష్య బంధం ఏమాత్రం చెదరలేదని ఈ సమ్మేళనం మరోసారి చాటిచెప్పింది. కార్యక్రమం ప్రారంభానికి ముందు పూర్వ విద్యార్థులు స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ ర్యాలీగా జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. తర్వాత మఠాధిపతి శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వామివారిని కలిసి ఆశీర్వచనాలు స్వీకరించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందుకున్నారు. ఈ సందర్భంగా మఠాధిపతి సోదరులు శ్రీ దత్తాత్రేయ స్వామివారు పూర్వ విద్యార్థులకు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామివారి చిత్రపటాలు, రుద్రాక్ష ప్రసాదాలను అందజేశారు. అనంతరం జగన్మాత అమ్మవారిని దర్శించుకుని, శ్రీ ఈశ్వరీ దేవి మఠం మఠాధిపతి శ్రీ వీర శివకుమార స్వామివారిని కలిసి వారి ఆశీస్సులు పొందారు. అక్కడి నుంచి ఐదు రోడ్ల కూడలి వరకు డీజే వాయిద్యాల నడుమ ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఆత్మీయ సమావేశానికి పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి అధ్యక్షత వహించారు. విద్యార్థినులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య



అతిథులుగా 1990 బ్యాచ్ ఉపాధ్యాయులు చలమయ్య, ఓబుల్‌రెడ్డి, చెన్నారెడ్డి, సి.వి. సుబ్బారెడ్డి పాల్గొన్నారు. విశ్రాంతి ఉపాధ్యాయులు చలమయ్య మాట్లాడుతూ, తాను బోధించిన విద్యార్థులు నేడు సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలిచి, గురువులను స్మరించుకుంటూ ఈ కలయికను నిర్వహించడం తనకు అపారమైన ఆనందాన్ని కలిగించిందన్నారు. విద్యార్థుల విజయాలే ఉపాధ్యాయులకు నిజమైన గౌరవమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల ఎదుగుదలను చూడడం తమ సొంత పిల్లల విజయాలను చూసినంత ఆనందంగా ఉందన్నారు. తాము బోధించిన విజ్ఞానం నేడు సమాజానికి ఉపయోగపడే వ్యక్తులను తీర్చిదిద్దిందనే సంతృప్తి తమకు కలుగుతోందని చెప్పారు. పూర్వ విద్యార్థి, శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం మఠాధిపతి సోదరులు శ్రీ దత్తాత్రేయ స్వామివారు మాట్లాడుతూ, విద్య అనేది దోచుకోలేని సంపద అని, ఆ అమూల్యమైన సంపదను అందించిన గురువులను సత్కరించడం తమ పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. మరో పూర్వ విద్యార్థి ఆవుల దస్తగిరి నాయుడు మాట్లాడుతూ, జీవితానికి సరైన దిశానిర్దేశం చేసి, అజ్ఞానాంధకారాన్ని తొలగించిన మహనీయులు తమ గురువులేనని కొనియాడారు. గురువుల బోధన వల్లే తాము జీవితంలో స్థిరపడగలిగామని తెలిపారు. కార్యక్రమ నిర్వాహకుడు దుగ్గిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, 35 సంవత్సరాల అనంతరం ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన సహచరులంతా ఒకేచోట కలుసుకోవడం జీవితంలో మరపురాని అనుభూతి అని చెప్పారు. ఈ కలయిక స్నేహబంధాలను మరింత బలోపేతం చేసిందన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులంతా కలిసి తమ గురువులు చలమయ్య, ఓబుల్‌రెడ్డి, చెన్నారెడ్డి, సి.వి. సుబ్బారెడ్డిలను పూలమాలలు, శాలువాలు, పట్టువస్త్రాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

కార్యక్రమం మొత్తం ఆత్మీయత, అనుబంధం, కృతజ్ఞత, గురుభక్తి ప్రతిబింబించేలా సాగింది. అలాగే స్థానిక నాయకులు ఎస్సార్ శ్రీనివాసులురెడ్డి, భాస్కర్ రెడ్డి నీ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో 1990--91 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు, విద్యార్థినులు, ఉపాధ్యాయులు, పలువురు ఆహ్వానితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గాన కోకిల జానకి స్వరం అజరామరం బిసి రాజారెడ్డి

- గాయని ఎస్.జానకికి ఘన నివాళులు అర్పించిన బిసి రాజారెడ్డి
- జానకి గారి మృతి సినీ గేయ లోకానికి తీరని లోటు
- కేంద్ర ప్రభుత్వం గాయని జానకికి భారతరత్న ప్రకటించాలని విన్నపం



**బనగానపల్లె- సూర్య వాస్తవం :** గాన కోకిల జానకి గారి స్వరం అజరామరం అని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్, అరుణ భారతి సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు బిసి రాజారెడ్డి అన్నారు. వయోభారంలో శ్వాస సంబంధ సమస్యలతో బాధపడుతూ గాయని జానకి శనివారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు గాయని జానకి మృతికి బిసి రాజారెడ్డి ఘన నివాళి అర్పించారు. బిసి రాజారెడ్డి కార్యాలయం నందు ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా బిసి రాజారెడ్డి మాట్లాడుతూ 6 ఏళ్ల పసిపాప నుంచి పండు ముసలి వరకు వారి స్వరాలను పలికే గొంతు ఒక జానకికే ఉందని చెప్పడంలో అతిశయోక్తి లేదన్నారు. జానకి గొంతే ఓ ప్రయోగశాలని కొనియాడారు. ఆరు దశాబ్దాల కాలంలో 14 భాషల్లో 48 వేల పాటలకు పైగా పాడి సినీ గేయ ప్రపంచంలోనే తనకంటూ ఓ మరపురాని చరిత్రను రాసుకున్నారన్నారు. ఆమె మధుర స్వరం నుంచి వెలువడిన పాటలు అజరామరంగా వెలు గొందు తాయన్నారు. పాటకు ప్రాణం పోసిన గొంతు ఆమెకే సొంతమన్నారు. అటువంటి గొప్ప గాయని మన దక్షిణాదిలోని ఆంధ్ర రాష్ట్రంలో జన్మించడం ఇక్కడి ప్రజల అదృష్టం అన్నారు. ఆమె భర్త రామ్ ప్రసాద్ సహకారంతో వేలాది పాటలు పాడి అతిరథ మహారాజుల చేతుల మీద సత్కారాలు, అవార్డులు పొందిన ఘనత ఒక్క గాయని జానకి కే దక్కిందన్నారు. సన్మానాలకు, అవార్డులకు పొంగిపోకుండా నిరాడంబర జీవితం గడిపిన మహోన్నత వ్యక్తి జానకి గారని, ఆమె జీవితం అందరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు. సప్తపది చిత్రంలో గోవులు తెల్లన... గోపయ్య నల్లనా అనే చిన్న పిల్లవాడి స్వరంతో పాడిన గొంతు చరిత్రలో ఎప్పటికీ చెరగని ముద్రలా నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో... భగవద్గీత ప్రచారకులు గురూజీ రామ శేషయ్య, జ్యోతిష్యం వెంకటరాముడు, గాలి శేష శయనా రెడ్డి, భరతుడు, బొబ్బల మహేశ్వర్ రెడ్డి, బలరామయ్య, బొబ్బల దివాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవం

## - కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర రోడ్లు ఌ భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ గుప్తా



**బనగానపల్లె -సూర్య వాస్తవం :** నంద్యాల జిల్లా బనగానపల్లెలోని తన నివాసానికి విచ్చేసిన మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ గుప్తా కి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆత్మీయ స్వాగతం పలికి మర్యాద పూర్వకంగా ఆహ్వానించారు. అనంతరం బనగానపల్లె పట్టణంలోని జీఎస్ఎస్ కళ్యాణ మండపంలో జరిగిన నంద్యాల జిల్లా ఆర్యవైశ్య పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో, మంత్రి బీసీ దంపతుల సమక్షంలో టంగుటూరి శ్రీనయ్య జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులుగా, కార్యవర్గ సభ్యులు తమ పదవులకు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన గౌరవ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి , ఇందిరా రెడ్డి మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ గుప్తా కి జిల్లా ఆర్యవైశ్య



సంఘ అధ్యక్షులు టంగుటూరి శ్రీనయ్య మరియు కార్యవర్గ సభ్యులు ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో ఆర్యవైశ్య సోదరులు, ప్రముఖులు, సంఘ ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బీజేపీ నేతల మౌనం ఎందుకో...




**విశాఖపట్టణం-సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ బీజేపీలో ఏదో జరుగుతుంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ పెద్దగా రాజకీయంగా యాక్టివ్‌గా లేకపోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వంపై ప్రత్యర్థులు విమర్శలు చేస్తున్నప్పటికీ దానికి సరైన కౌంటర్ మాత్రం ఇవ్వడం లేదు. బీజేపీ నేతల మౌనం వెనక అర్థం ఏంటన్నది ఇప్పటికీ కూటమిలోని ప్రధాన పక్షాలైన టీడీపీ, జనసేనలకు అర్థం కాకుండా ఉంది. రాష్ట్ర నేతలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారా? లేదా కేంద్ర నాయకత్వం నుంచి ఏమైనా ఆదేశాలు ఉన్నాయా? అన్న అనుమానం అందరిలోనూ కలుగుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు పూర్తి కావస్తున్నప్పటికీ కమలం పార్టీ రాష్ట్ర నేతలు మాత్రం సంతోషంగా లేరు. తమ నియోజకవర్గాల్లో... అనేక నియోజకవర్గాల్లో తాము ప్రాతినిధ్యం వహిస్తున్న చోట టీడీపీ, జనసేన నుంచి తమకు మద్దతు లభించడం లేదని రివర్స్ లో బీజేపీ నేతలు ఈ విధమైన నిరాసక్తతతో ఉన్నారని చెబుతున్నారు. మొన్నటి ఎన్నికల్లో బీజేపీ పది స్థానాల్లో పోటీ చేసింది. ఎనిమిది స్థానాల్లో విజయం సాధించింది. అలాగే ఆరు లోక్ సభ స్థానాలకు పోటీ చేసి మూడింటిలోవిజయం సాధించింది. అనపర్తి నుంచి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి , కైకలూరు నుంచి కామినేని శ్రీనివాస్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి సుజనా చౌదరి, ఆదోని నుంచి డా. పి.వి. పార్థసారథి, జమ్మలమడుగు నుంచి ఆదినారాయణ రెడ్డి, ధర్మవరం నుంచి సత్య కుమార్ యాదవ్, ఎచ్చెర్ల నుంచి నడుకుదిటి ఈశ్వరరావు ఎన్నికయ్యారు. విశాఖపట్నం ఉత్తరం నుంచి పెన్మెత్స విష్ణు కుమార్ రాజులు ఎన్నికయ్యారు. రాజమండ్రి పార్లమెంటు నుంచి దగ్గుబాటి పురంధేశ్వరి, అనకాపల్లి సీఎం రమేష్, నర్సాపురం నుంచి భూపతిరాజు శ్రీనివాసవర్మలు ఎన్నికయ్యారు. దీంతో పాటు మాధవ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు... కానీ ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలున్నప్పటికీ ఎవరూ పెద్దగా స్పందించడం లేదు. అసలు కూటమి ప్రభుత్వంతో తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వం పై వస్తున్న ఆరోపణల విషయంలోనూ పెద్దగా స్పందించడం లేదు. ఇందుకు ప్రధాన కారణం.. కూటమి సర్కార్ లో తమకు ప్రాధాన్యత దక్కకపోవడం ఒక కారణమయితే, మరొక ముఖ్యమైన కారణం.. తమ నియోజకవర్గాల్లో టీడీపీ ఇన్ ఛార్జుల పెత్తనం సాగుతుండటమేనని చెబుతున్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని కేంద్ర నాయకత్వానికి కొందరు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అయితే సంయమనం పాటించాలని, రానున్న కాలంలో అంతా సర్దుకుంటుందని నాయకత్వం చెప్పిందట. అయినా సరే కూటమిలో మిత్రధర్మం పాటించకుండా వ్యవహరించడంపై టీడీపీ, జనసేనలో కొంత అసంతృప్తి అయితే మొదలయింది. తెలుగు రాష్ట్రాల్లో వర్షాభావం, రుతుపవనాల లోపం వల్ల వ్యవసాయానికి తీవ్ర ఆటంకం కలిగి కరవు పరిస్థితులు ఏర్పడ్డాయి.

# టీడీపీలోకి హితేష్




**ఒంగోలు -సూర్య వాస్తవం :** తెలుగుదేశం పార్టీలోకి మరో యువనేత ఎంట్రీకి రంగం సిద్ధం అయినట్లు తెలుస్తోంది. నందమూరి తారకరామారావు మనవడు దగ్గుబాటి హితేష్ త్వరలో పార్టీలో చేరుతారని తెలుస్తోంది. ఆయన మాజీ మంత్రులు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి ల కుమారుడు. ఆయన పూర్తి పేరు హితేష్ చెంచురాం. గతంలో కుటుంబంలో నెలకొన్న విభేదాలు సమసి పోవడంతో చేరికకు మార్గం సుగమం అయినట్లు తెలుస్తోంది . ప్రస్తుతం దగ్గుబాటి పురందేశ్వరి భారతీయ జనతా పార్టీలో ఉన్నారు. ఆ పార్టీ ఎంపీగా కొనసాగుతున్నారు. దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా ఉన్నారు. దశాబ్దాలుగా చంద్రబాబుతో ఉన్న విభేదాలు సమసిపోవడంతో హితేష్ టిడిపిలో చేరికకు రంగం సిద్ధం అయింది. ఈ మేరకు చంద్రబాబు సైతం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో త్వరలో హితేష్ సైకిల్ ఎక్కడం ఖాయం అన్నట్లు తెలుస్తోంది.దగ్గుబాటి వెంకటేశ్వరరావు నందమూరి తారక రామారావు అల్లుడు. సీఎం చంద్రబాబుకు స్వయానా తోడల్లుడు. 1983 నుంచి 2009 వరకు క్రియాశీలక రాజకీయాల్లో నడిచారు. 1983 అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. అసెంబ్లీలో అడుగుపెట్టారు. 1985, 1989, 2004, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచారు. 1991లో మాత్రం ఎంపీగా విజయం సాధించారు. 1996లో రాజ్యసభకు ఎంపికయ్యారు. 2019లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. ఆయనపై టిడిపి అభ్యర్థి ఏలూరి సాంబశివరావు గెలిచారు. సుదీర్ఘకాలం పరుచూరు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం అక్కడ టిడిపి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఉన్నారు. అయినా సరే హితేష్ టిడిపిలో చేరి రాజకీయాలు చేయాలని భావిస్తున్నారు పురందేశ్వరి సైతం తన భర్త వెంకటేశ్వరరావుతో కలిసి 2004లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బాపట్ల నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచారు. రెండోసారి విశాఖ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో మంత్రిగా కూడా వ్యవహరించారు. అయితే ఆమె తర్వాత బిజెపిలో చేరగా.. ఆమె భర్త వెంకటేశ్వరరావు మాత్రం వైసీపీలో చేరారు. 2019 ఎన్నికల్లో వెంకటేశ్వరరావు వైసీపీలో ఓడిపోయిన తర్వాత సైలెంట్ మోడ్ లోకి వెళ్లిపోయారు. వాస్తవానికి చంద్రబాబుతో విభేదించి టిడిపి నుంచి బయటకు వచ్చేసారు. ఇప్పుడు అదే చంద్రబాబుతో విభేదాలు పూర్తిగా సమసి పోయాయి. పైగా సోదరుడు లోకేష్ తో హితేష్కు మంచి సంబంధాలు ఉన్నాయి. అందుకే లోకేష్ టీమ్ లో చేరేందుకు హితేష్ రాజకీయాల్లోకి ప్రవేశించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. చంద్రబాబు నుంచి సైతం గ్రీన్ సిగ్నల్ లభించడంతో త్వరలో హితేష్ టిడిపిలో చేరనున్నారు.



## రెండు రోజుల్లో రికార్డు వసూళ్లు... దూసుకుపోతున్న అఖిల్ 'లెనిన్'

**బాక్సాఫీస్ వద్ద 'లెనిన్'కు కలెక్షన్ల సునామీ**
- రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 37.2 కోట్ల గ్రాస్
- పాజిటివ్ మౌత్ టాక్‌తో భారీగా పెరుగుతున్న వసూళ్లు
- చాలా కాలం తర్వాత అఖిల్‌కు సాలిడ్ కమర్షియల్ హిట

అక్కినేని అఖిల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'లెనిన్' బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ విడుదలైన కేవలం రెండు రోజుల్లోనే ప్రపంచ వ్యాప్తంగా రూ. 37.2 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు చిత్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధికారికంగా ప్రకటించింది. థియేటర్లలో అఖిల్ ఊరమాస్ నటనకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది.మంచి మౌత్ టాక్ రావడంతో సినిమా వసూళ్లు రోజురోజుకు పెరుగుతున్నాయి. "ప్రేక్షకుల మౌత్ టాక్ అద్భుతంగా పనిచేస్తోంది. రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా 37.2 కోట్ల గ్రాస్ సాధించి 'లెనిన్' దూసుకుపోతోంది" అంటూ నిర్మాణ సంస్థ ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. చాలా కాలంగా సరైన కమర్షియల్ హిట్ కోసం ఎదురుచూస్తున్న అఖిల్‌కు ఈ సినిమా రూపంలో అది లభించడంతో అక్కినేని అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు.మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వంలో గ్రామీణ నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కింది. ఇందులో అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో పాటు అన్నపూర్ణ స్టూడియోస్, మనం ఎంటర్‌ప్రైజెస్ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మించాయి. ఎస్ఎస్ తమన్ అందించిన నేపథ్య సంగీతం సినిమాకు ప్రధాన బలంగా నిలిచిందని ప్రేక్షకులు చెబుతున్నారు. వీకెండ్ ముగిసే నాటికి ఈ వసూళ్లు మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

## రష్మిక ఆసక్తికర పోస్ట్..

# 'రణబాలి'పై అంచనాలు పెంచేసింది!

- విజయ్ దేవరకొండ, రష్మిక జంటగా రణబాలి
- రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో పీరియాడిక్ చిత్రం
- కొన్ని సీన్లు అద్భుతంగా ఉన్నాయంటూ రష్మిక పోస్ట్



టాలీవుడ్ స్టార్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న కొత్త చిత్రం 'రణబబాలి'. తాజాగా ఈ చిత్రం గురించి రష్మిక ఆసక్తికరమైన పోస్ట్ చేశారు. ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు చూసిన ఆమె, తన ఉత్సాహాన్ని ఆపుకోలేక సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. రష్మిక చేసిన ఈ వ్యాఖ్యలతో సినిమాపై అంచనాలు అమాంతం పెరిగాయి. ఇందులో రణబాలిగా విజయ్, జయమ్మ పాత్రలో రష్మిక అలరించనున్నారు.ఎక్స్ వేదికగా రష్మిక స్పందిస్తూ.. "ఈ విషయం నేను మీతో పంచుకోవచ్చో లేదో తెలియదు. గతంలో చాలాసార్లు జరిగినట్లు దీన్ని డిలీట్ చేయమని అడగరని ఆశిస్తున్నా. కానీ, ఈ కుర్రాళ్లు చాలా బీభత్సం చేస్తున్నారు. ఆ సీన్లు అద్భుతం. నేను కంట్రోల్ చేసుకోలేకపోయా. దీన్ని పెద్ద తెరపై చూడటానికి అస్సలు ఆగలేకపోతున్నా" అని రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌లో విజయ్ దేవరకొండతో పాటు దర్శకుడు రాహుల్ సంకృత్యాన్‌ను కూడా ఆమె ట్యాగ్ చేశారు.పీరియాడిక్ చిత్రంగా రూపుదిద్దుకుంటున్న రణబాలి చిత్రానికి రాహుల్ సాంకృత్యన్ దర్శకుడు. రియల్ లైఫ్ జోడీ విజయ్, రష్మిక ఈ సినిమాలోనూ జంటగా నటిస్తున్నారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన గీతగోవిందం, డియర్ కామ్రేడ్ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించాయి.

## ఓటీటీలోకి వస్తున్న 'మా ఇంటి బంగారం'...

### ఎక్కడ, ఎప్పుడంటే..!

**ఓటీటీలోకి రాబోతున్న సమంత 'మా ఇంటి బంగారం'**
**జూలై 17 నుంచి జియోహాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్**
**థియేటర్లలో రూ.100 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన చిత్రం**
**విడుదలైన నాలుగు వారాల్లోనే డిజిటల్ ప్రీమియర్**
**సమంత నటన, యాక్షన్ సన్నివేశాలకు ప్రశంసలు**

స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'మా ఇంటి బంగారం' ఓటీటీ విడుదలకు సిద్ధమైంది. థియేటర్లలో భారీ విజయం సాధించిన ఈ సినిమా, జూలై 17 నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జియోహాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం, నెల రోజులు కూడా గడవకముందే డిజిటల్ ప్రేక్షకులను పలకరిం చబో తుండటం గమనార్హం.నందిని రెడ్డి దర్శకత్వం వహించిన 'మా ఇంటి బంగారం' చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించింది. యాక్షన్, కామెడీ, ఫ్యామిలీ డ్రామా అంశాలతో తెరకెక్కిన ఈ సినిమా రూ.100 కోట్లకు పైగా వసూళ్లు సాధించి రికార్డు నెలకొల్పింది. కథానాయిక ప్రాధాన్యమున్న చిత్రాల్లో ఈ ఘనత సాధించిన తొలి తెలుగు సినిమాగా నిలిచింది. స్వర్ణ అనే అనాథ యువతిగా సమంత నటన, ముఖ్యంగా ఆమె చేసిన యాక్షన్ సన్నివేశాలు, కామెడీ టైమింగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.తన భర్త



రాజ్ నిడిమోరు, తదితరులతో కలిసి సమంత ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇందులో దిగంత్ మంచాలే, గుల్షన్ దేవయ్య, శ్రీముఖి, గౌతమి కీలక పాత్రల్లో నటించారు. తొలుత ఈ సినిమా జూలై చివరిలో లేదా ఆగస్టులో ఓటీటీలోకి వస్తుందని ప్రచారం జరిగినా, అనూహ్యంగా ముందుగానే స్ట్రీమింగ్ డేట్‌ను ఖరారు చేసినట్లు తెలుస్తోంది.



## లార్డ్స్ మైదానంలో చరిత్ర సృష్టించిన

# భారత బ్యాటర్ యస్తికా భాటియా

**- లార్డ్స్‌లో టెస్ట్ సెంచరీ చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా యస్తికా భాటియా- ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్టులో ఈ అరుదైన ఘనత**
**- తీవ్ర గాయం నుంచి కోలుకొని వచ్చి చారిత్రక ఇన్నింగ్స్ ఆడిన యస్తికా-సహచర బౌలర్ క్రాంతి గౌడ్ తర్వాత లార్డ్స్ ఆనర్స్ బోర్డుపైకి ఎక్కిన భారత ప్లేయర్-145 బంతుల్లో 12 ఫోర్లతో తొలి అంతర్జాతీయ సెంచరీ నమోదు**

భారత మహిళా వికెట్ కీపర్-బ్యాటర్ యస్తికా భాటియా చరిత్ర సృష్టించింది. ప్రఖ్యాత లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్‌లో టెస్ట్ సెంచరీ సాధించిన తొలి మహిళా క్రికెటర్‌గా ఆమె సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో మూడో రోజైన ఆదివారం యస్తికా ఈ అరుదైన ఘనతను అందుకుంది.ఇంగ్లండ్ తో ఏకైక టెస్టులో లంచ్ విరామానికి 91 పరుగులతో క్రీజులో ఉన్న యస్తికా, తిరిగి ఆట మొదలయ్యాక ఏమాత్రం ఒత్తిడికి గురికాలేదు. ఇంగ్లండ్ పేసర్ ఇస్సీ వాంగ్ బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు బాది, ఆపై కవర్స్ దిశగా సింగిల్ తీసి తన తొలి అంతర్జాతీయ శతకాన్ని పూర్తి చేసుకుంది. 145 బంతుల్లో 12 ఫోర్ల సహాయంతో ఆమె ఈ సెంచరీని నమోదు చేసింది. సెంచరీ పూర్తికాగానే యస్తికా భావోద్వేగంతో మైదానంలో మోకాళ్లపై కూర్చొని పిచ్‌ను ముద్దాడింది. స్టేడియంలోని ప్రేక్షకులంతా లేచి నిలబడి చప్పట్లతో ఆమెను అభినందించారు.కెరీర్‌ను ప్రమాదంలో పడేసిన మోకాలి (ఏసీఎల్) గాయం నుంచి కోలుకొని ఈ ఇంగ్లండ్ పర్యటనతోనే యస్తికా అంతర్జాతీయ క్రికెట్‌లోకి పునరాగమనం చేసింది. ఈ చారిత్రక ఇన్నింగ్స్‌తో తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకుంది. ఆట ప్రారంభమైన తొలి బంతికే లారెన్ బెల్ వేసిన బంతి




వికెట్లను తాకినా బెయిల్స్ కింద పడకపోవడంతో యస్తికా అదృష్టవశాత్తు బతికిపోయింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అద్భుత ఇన్నింగ్స్ ఆడింది.ఇదే మ్యాచ్‌లో ఐదు వికెట్ల ప్రదర్శనతో ఇప్పటికే లార్డ్స్ ఆనర్స్ బోర్డుపై చోటు సంపాదించిన తన సహచర క్రీడాకారిణి క్రాంతి గౌడ్ సరసన యస్తికా కూడా చేరింది.



### వరుస ఓటముల ఎఫెక్ట్:

## గంభీర్ కోచింగ్ బృందంపై వేటుకు రంగం సిద్ధం?

**ఇంగ్లండ్, ఐర్లాండ్ చేతిలో టీమిండియా వరుస టీ20 సిరీస్ ఓటములు**
**హెడ్ కోచ్ గంభీర్ సహాయక సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి**
**అసిస్టెంట్, బౌలింగ్ కోచ్‌లు తమ పదవుల నుంచి తప్పుకునే యోచన**
**ఫీల్డింగ్ ప్రమాణాలపై అసంతృప్తి.. ఫీల్డింగ్ కోచ్‌పైనా వేటుకు ఛాన్స్**
**వన్డే సిరీస్ తర్వాత కోచింగ్ బృందంలో మార్పులు జరిగే అవకాశం**

టీ20 ప్రపంచ ఛాంపియన్ టీమిండియా వరుస ఓటములతో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఐర్లాండ్, ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లలో ఘోర పరాజయాలు ఎదురుకావడంతో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సహాయక సిబ్బంది భవిష్యత్తు సందిగ్ధంలో పడింది. మంగళవారం నుంచి ఇంగ్లండ్‌తో ప్రారంభం కానున్న వన్డే సిరీస్ తర్వాత కోచింగ్ బృందంలో మార్పులు జరిగే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.గత నెల ఐర్లాండ్‌తో జరిగిన సిరీస్‌ను 0-2తో కోల్పోయిన భారత్, శనివారంతో ముగిసిన ఇంగ్లండ్ సిరీస్‌ను ఏకంగా 0-4తో చేజార్చుకుంది. ఈ పరిణామాల నేపథ్యంలో, 2024లో గంభీర్ ఎంపిక చేసుకున్న అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డెస్కాటే, బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ తమ పదవుల నుంచి తప్పుకోవాలని యోచిస్తున్నట్లు సమాచారం. సుదీర్ఘ ప్రయాణాల పట్ల టెన్ డెస్కాటే ఆందోళన వ్యక్తం చేస్తుండగా, మరోవైపు ఓ ఐపీఎల్ ఫ్రాంచైజీతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అటు, మోర్కెల్ తన భవిష్యత్తుపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. వీరిద్దరితో బీసీసీఐ చర్చలు జరుపుతోంది.వీరితో పాటు, ఫీల్డింగ్ కోచ్ టి. దిలీప్ పదవి కూడా ప్రమాదంలో పడింది. ఇటీవలి కాలంలో జట్టు ఫీల్డింగ్ ప్రమాణాలు పడిపోవడంపై బీసీసీఐ అసంతృప్తితో ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్‌తో సహా ఈ కోచింగ్ బృందం బీసీసీఐతో 2o1 సంవత్సరాల ఒప్పందాలు కుదుర్చుకుంది.ఈ ఓటముల నేపథ్యంలో హెడ్ కోచ్ గంభీర్ (2027 వన్డే ప్రపంచకప్ వరకు కాంట్రాక్ట్) పదవిపై కూడా మీడియాలో చర్చ జరుగుతున్నప్పటికీ, ప్రస్తుతానికి మార్పులన్నీ సహాయక సిబ్బందికే పరిమితం అయ్యేలా కనిపిస్తున్నాయి.

# 26 వేలు కనీస వేతనం అమలుచేయాలి

## - జూలై 30న తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయండి
## - సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా పోస్టర్ ఆవిష్కరణ




**తిరుపతి-సూర్య వాస్తవం :** జూలై 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, సొసైటీ తదితర రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు నెలకు ?26,000 కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో విస్తృత ప్రచార కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా కార్మికులకు కరపత్రాల పంపిణీ, సంతకాల సేకరణ, గేట్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహిస్తూ, రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద నిర్వహించనున్న ధర్నాలో భాగంగా జూలై 30న తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ నేడు తిరుపతి యశోదనగర్‌లోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టి. సుబ్రమణ్యం, జిల్లా అధ్యక్షులు ఎస్. జయచంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, సొసైటీ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు అత్యంత దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నారని అన్నారు. తిరుపతి జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది కార్మికులు చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు, విద్య, వైద్యం, ఇళ్ల అద్దెలు, విద్యుత్ ఛార్జీలు, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రస్తుతం ఇస్తున్న వేతనాలతో కనీస జీవనం కూడా అసాధ్యంగా మారిందన్నారు. మూడు పూటలా భోజనం పెట్టలేని, పిల్లలకు చదువు చెప్పించలేని, అప్పుల ఊబిలో కూరుకుపోయిన పరిస్థితుల్లో కార్మిక కుటుంబాలు జీవిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల పెంపుపై ఒక్క మాట కూడా మాట్లాడకుండా కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తోందని తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం “ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్”, “స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్”, పీపీపీ విధానాల పేరుతో ప్రభుత్వ రంగాలను బలహీనపరుస్తూ, శాశ్వత ఉద్యోగాలను కుదిస్తూ, కాంట్రాక్టీకరణను విస్తరిస్తోందన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ సంస్థలకు అపరిమిత రాయితీలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా మారిందని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కార్మిక చట్టాలను బలహీనపరుస్తూ ఎనిమిది గంటల పని విధానాన్ని నిర్వీర్యం చేసి 12 నుంచి 14 గంటల వరకు పని చేయించుకునే పరిస్థితులకు ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తోందన్నారు. ఇది కార్మికులపై తీవ్రమైన శ్రమ దోపిడీకి దారితీస్తోందని, మహిళా కార్మికులను రాత్రి వేళల్లో పనిచేయించే విధానాలకు కూడా ప్రభుత్వం మార్గం సుగమం చేస్తోందని, ఇది మహిళల భద్రతకు, కార్మిక హక్కులకు తీవ్రమైన ముప్పు అని అన్నారు. పెద్ద పెద్ద కార్పొరేట్ కంపెనీల్లో, పరిశ్రమల్లో వలస కార్మికులు పని ప్రదేశాల్లో ప్రమాదాలకు గురై మరణిస్తున్న సంఘటనలు తరచూ జరుగుతున్నప్పటికీ, వాటిని బయటకు రానీయకుండా యాజమాన్యాలు, అధికార యంత్రాంగం కలిసి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, భద్రతా ప్రమాణాలు అమలు చేయకుండా యాజమాన్యాలకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని అన్నారు. పని చేసే హక్కుతో పాటు సురక్షితంగా జీవించే హక్కును కూడా ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. కార్మికుల శ్రమతోనే పరిశ్రమలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థలు నడుస్తున్నప్పటికీ వారికి జీవనోపాధికి సరిపడా వేతనం ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడం అత్యంత దురదృష్టకరమన్నారు. కార్మికులకు నెలకు ?26,000 కనీస వేతనం, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, చట్టబద్ధమైన కార్మిక హక్కులు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అందువల్ల రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద నిర్వహించనున్న ధర్నాలో భాగంగా జూలై 30న తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, సొసైటీ, స్కీమ్ మరియు అసంఘటిత రంగ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కే. వేణుగోపాల్, జి. బాలాజీ, పి. బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో
# ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణపై సమీక్ష

### - రామకృష్ణ థియేటర్ సర్కిల్, లక్ష్మీపురం, వైకుంఠపురంలలో
### ఆకస్మిక తనిఖీ చేసిన భారత ఎన్నికల కమిషన్ కార్యదర్శి శ్రీ నవీన్ కుమార్



**తిరుపతి-సూర్య వాస్తవం :** ఎస్ ఐ ఆర్ ప్రక్రియ లో భాగంగా ఇంటింటి సర్వే కార్యక్రమం చేపట్టాలని భారత ఎన్నికల కమిషన్ కార్యదర్శి నవీన్ కుమార్ ఆదేశించారు. ఎస్ ఐ ఆర్ కార్యక్రమం లో భాగంగా ఆదివారం తిరుపతి పట్టణంలో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ విధానంపై స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జేసి ఆర్ గోవిందరావు, నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి, స్మార్ట్ సిటీ జిఎం చంద్రమౌళి, తదితరులతో కలసి భారత ఎన్నికల కమిషన్ కార్యదర్శి నవీన్ కుమార్ సమీక్ష నిర్వహించి దశా నిర్దేశం చేశారు. సమీక్షా సమావేశం అనంతరం మున్సిపల్ భారత ఎలక్షన్ కమిషన్ అధికారులు బృందం సెక్షన్ ఆఫీసర్ అనిత కుక్రేజా, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఉదిత్ కుమార్ లతో కలసి క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పర్యటించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ బృందం క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా తిరుపతి పట్టణం లోని రామకృష్ణ థియేటర్ సర్కిల్ 38వ పోలింగ్ స్టేషన్ పరిధిలోని 37 వ వార్డు, లక్ష్మీపురం 12వ వార్డు సచివాలయం పరిధిలోని పోలింగ్ స్టేషన్ ల వారీగా ఉన్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. తదుపరి చంద్రగిరి అసెంబ్లీ ూజ, తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు పంచాయతీ, చిన్నగొట్టిగలు మండలం భాకరాపేట, ఎర్రావారిపాలెం మండలం నెరబైలు పరిధిలోని పోలింగ్ స్టేషన్ పరిధిలో క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా సూపర్వైజర్స్ ను తమ పరిధిలో గల బిఎల్ లు, పోలింగ్ స్టేషన్స్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. బిఎల్ఓ ల పరిధిలో గల ఓటర్ల సంఖ్య, సేకరించిన ఎన్యూమరేషన్ ఫారమ్స్ సంఖ్య ను ఆరా తీశారు. తదుపరి ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్ పరిశీలించి సచివాలయ సిబ్బందిబిఎల్ఎ లతో మాట్లాడారు. తిరుచానూరు పరిధిలో ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చినవారు ఉండడంతో వారు తిరిగి వెళ్ళిపోయిన నేపథ్యంలో 2002 ఓటర్ల జాబితా తో పోల్చలేకున్నామని వివరించారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ జరుగుతున్న విధానాన్ని బి ఎల్ ఏ లతో విచారించగా వారు సంతృప్తి వ్యక్తం చేశారు. వైకుంఠపురం లోని 250 పోలింగ్ స్టేషన్ పరిధిలోని 19 వ వార్డు ఇంటింటి సర్వేలో పాల్గొని హౌస్ హోల్డర్స్‌తో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్‌డిఓ రామ్మోహన్, తిరుపతి అర్బన్ తహసిల్దార్ సురేష్ బాబు, తిరుపతి రూరల్ తాసిల్దార్ జనార్దన్ రాజు, సచివాలయం సిబ్బంది బిఎల్ఓ లు, బి ఎల్ ఏ లు, తదితరులు ఉన్నారు.



## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు



**తిరుపతి-సూర్య వాస్తవం :** ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియ నేపథ్యంలో ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను రద్దు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ. సి) శారదా దేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది ప్రత్యేక ఓటర్ల సవరణ (ూ×=) ప్రక్రియలో ఉండడం వాపన నగరపాలక సంస్థ కార్యాలయంలో జూలై 13వ తేది సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం రద్దు చేశామని తెలిపారు. ప్రజలు సహకరించాలని కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి ఆ ప్రకటనలో తెలియజేశారు.

## జూలై 14న తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో వైభవంగా అష్టోత్తర శతకలశాభిషేకం, కల్యాణోత్సవం

### - అమావాస్య, పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని విశేష ఆర్జిత సేవలు

**తిరుపతి-సూర్య వాస్తవం :** తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో జూలై 14వ తేదీన అమావాస్య, పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని అష్టోత్తర శతకలశాభిషేకం, శ్రీ సీతా లక్ష్మణ సమేత శ్రీ కోదండరామస్వామివారి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. అమావాస్య సందర్భంగా ఉదయం 8.30 గంటలకు అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహిస్తారు. ఈ సేవలో గృహస్తులు (ఇద్దరు) రూ.500/- టికెట్‌తో పాల్గొనవచ్చు. అనంతరం రాత్రి 7 గంటల నుండి 9 గంటల వరకు హనుమంత వాహనసేవ భక్తి శ్రద్ధల మధ్య జరుగుతుంది. సర్వాలంకార భూషితులైన శ్రీ కోదండరామ స్వామివారు తనకు అత్యంత ప్రీతిపాత్రమైన హనుమంత వాహనంపై ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు దివ్య దర్శనమివ్వనున్నారు. పునర్వసు నక్షత్రాన శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవంశ్రీరామచంద్రమూర్తి జన్మనక్షత్రమైన పునర్వసు సందర్భంగా ఉదయం 11 గంటలకు శ్రీ సీతా లక్ష్మణ సమేత శ్రీ కోదండరామస్వామివారి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. గృహస్తులు (ఇద్దరు) రూ.500/- టికెట్ ద్వారా ఈ దివ్యోత్సవంలో పాల్గొనవచ్చు. పాల్గొనే గృహస్తులకు ఉత్తరీయం, రవికె, అన్నప్రసాదం బహుమానంగా అందజేస్తారు. అనంతరం సాయంత్రం 5.30 గంటలకు ఉత్సవమూర్తులను ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి, శ్రీరామచంద్ర పుష్కరిణి వద్ద ఊంజల్‌సేవ నిర్వహిస్తారు. కల్యాణోత్సవంలో పాల్గొనే గృహస్తులు సంప్రదాయ వస్త్రధారణలో హాజరుకావాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

## రాజు గుంట దళితవాడ ప్రజలకు ఇంటి తలాలకు, భూమికి పట్టాలు మంజూరు చేయాలి



శ్రీకాళహస్తి -సూర్య వాస్తవం :శ్రీకాళహస్తి మండలం, యార్లపూడి పంచాయతీ, రాజు గుంట దళితవాడలో కనీస సౌకర్యాలు లేక దళితులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. స్మశానానికి చుట్టూ జీవో నెంబర్ 1235 ప్రకారం ప్రహరీ గోడ నిర్మించాలి. వారు వేసుకున్న ఇళ్లకు పట్టాలు లేక ప్రభుత్వ గృహ నిర్మాణ రుణ సదుపాయం అందక అప్పుల పాలవుతున్నారు. తమ సాగులోని భూములకు పట్టాల లేక భూమి అభివృద్ధికి నిధులు మంజూరు చేయక అవస్థలు పడుతున్నారు. తమ పిల్లలు స్కూల్కు పోవడానికి బస్సు రావాలంటే మట్టి రోడ్డును తారు రోడ్డుగా మార్చి తమ పిల్లల భవిష్యత్తు బాగుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరుతున్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం , ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు దళితువాడ ప్రజలతో సమస్యలపై సర్వే నిర్వహించిన సందర్భంగా దళితుల పట్ల ప్రభుత్వం చూపుతున్న వివక్షను విడనాడి తమ సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య ,జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య ప్రజల్ని కలిసి సమస్యలు తెలుసుకున్న వారిలో ఉన్నారు.

## మంగళం డిపోను పినాకిల్ సంస్థకు కట్టబెట్టొద్దు

### - 500 మంది ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడొద్దు
### - చెట్లు కొట్టి పర్యావరణానికి నష్టం చేయవద్దు
### - సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి



**తిరుపతి-సూర్య వాస్తవం :**ప్రభుత్వ సంస్థ ఆర్టీసీని దాని ఆస్తులను ప్రైవేటు సంస్థలకు పప్పు, బెల్లాల్లా పంచి పెడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు ద్రోహం చేస్తున్నదని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. తిరుపతి నగరానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న వందల కోట్ల విలువ చేసే 10 ఎకరాల పైనే ఉన్న మంగళం డిపో భూములను పూణేకి చెందిన పినాకిల్ సంస్థకు కట్టబెట్టడం దారుణమని అన్నారు. 95 బస్సులు, 500 మందికి పైగా ఉద్యోగులతో ఉన్న మంగళం డిపోను చెల్లా చెదురుచేసి బస్సులను, ఉద్యోగులను వివిధ డిపోలకు బదిలీ చేసి డిపోను 24 బస్సులకు పరిమితం చేశారని ఆరోపించారు.


PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )